జన రాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 6 సంచిక - 2 పక్షపత్రిక జనవరి 16-31, 2015



## ప్రమాణాలు పతనం పట్టించుకోని ప్రభుత్వం




కరీంనగర్‌లో చలిమెడ ఆనందరావు వైద్యకళాశాలలో
'వైద్య విద్య- నైతిక విలువలు ' అంశంపై
ప్రసంగిస్తున్న జేపీ. హాజరైన విద్యార్థులు, ప్రొఫెసర్లు



జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక జనవరి 16-31, 2015

సంపుటి - 6 సంచిక - 2

## లోపలి పేజీల్లో...

విద్యా హక్కు... వీడని చిక్కు! -6లో

రికార్డులు ప్రైవేట్ ఆస్తులు కావు -9లో

సవాళ్లకు సంస్కరణలే.. సై! -14లో

అవినీతి రహిత సమాజాన్ని స్థాపించాలి -16లో

చదువులు చట్టుబండలు -22లో

కొన్ని అనివార్య కారణాల వల్ల లోక్‌సత్తా టైమ్స్ జనవరి 1-15 సంచికను వెలువరించలేక పోయాము.

సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

డి.వి.వి.యస్. వర్మ
సంపాదకులు

సంపాదక వర్గం
పి. రవిమారుత్
బండారు రామ్మోహన్‌రావు
ఓంకార్
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

## సంపాదకీయం

# మరో దండగమారి ఎత్తిపోతల

చంద్రబాబు ప్రభుత్వానికి రోజుకో ప్రకటన కావాలి. రోజుకో పథకం కావాలి. దాని సాధ్యాసాధ్యాలు అక్కరలేదు. అవసరమా అనవసరమా అన్న చర్చ లేదు. ప్రతినిత్యం పారదర్శకత మీద ప్రసంగాలుచేసే బాబు పోలవరం ఎత్తిపోతల మీద దానిని పాటించడం లేదు. పోలవరం ఎత్తిపోతల కావాలని కోరిన వారు ఒక్కరు లేరు. కృష్ణా జిల్లాకి, రాయలసీమ జిల్లాలకి తక్షణమే నీరు అందించడం కోసం దీనిని తలపెట్టినట్టు మాత్రం ప్రకటించారు. దీనికి 1350 కోట్లు విడుదలకు సిద్ధం అయ్యారు. అసలే డబ్బులు లేని కాలంలో ఈ కొత్త పథకం ఎందుకో ఎవరికీ అంతు పట్టడంలేదు. నిజంగా రాయలసీమ జిల్లాలకు నీళ్లు ఇవ్వాలంటే అక్కడ పెండింగ్ ప్రాజెక్టులు నిధుల కోసం వేచి చూస్తున్నాయి. వాటిని పూర్తి చేసే పని చేపట్టవచ్చును. ఉత్తరాంధ్రలో ప్రాజెక్టులు నిధుల కేటాయింపులకు ఎదురు చూస్తున్నాయి. వాటికి నిధులు కేటాయించవచ్చును.

కృష్ణా డెల్టా ఆధునీకరణ పథకం నిధులుండీ నడవడం లేదు. అక్కడ కాల్వలకు నీరున్నా పారడంలేదు.ఆధునీకరణ పూర్తి చేస్తే 29 టి.యం.సిల నీళు మిగులుతాయి. పులిచింతల పూర్తయింది.పరిహారాల చెల్లింపులు పూర్తి చేస్తే 45 టి.యం.సిల నీటి నిల్వకు అవకాశాలు వస్తాయి.ఇవి చేస్తే కృష్ణాజలాలలో కొంత రాయలసీమకు తరలించవచ్చును. కాని ప్రభుత్వం దీని మీద దృష్టి పెట్టడం లేదు.

పోలవరం ఎత్తిపోతల 6 నెలలలో సాధ్యపడేది కాదు. ఇంకా దాదాపు 40 కిలోమీటర్లు కాల్వ తవ్వాలి. దానికి రైతుల అనుమతులు, కోర్టు తీర్పులు రాక 7 సంవత్సరాలుగా పనులు జరగడంలేదు. పైగా రెండు అక్విడక్టులు నిర్మించాలి. ఇవన్నీ 6 నెలలలో పూర్తిచేసి నీరిస్తామనడం కంటే దగా మరొకటి వుండదు.

పైగా వరదల సమయంలో గోదావరి నీరు కృష్ణాకు మళ్లిస్తామంటున్నారు. ఆ నీటిని ఎక్కడ నిల్వచేస్తారో, ఎలా వినియోగిస్తారో ప్రకటించడం లేదు. కృష్ణా బారేజీ నిల్వ సామర్థ్యం 2-3 టి.యం.సిలే. పైగా గోదావరి వరదలదీ కృష్ణా వరదలదీ ఒకటే సీజను.

ఇక చివరిది 4 సంవత్సరాలలోగా పోలవరం ప్రాజెక్ట్ పూర్తి చేస్తామని ప్రకటిస్తూ ఈ తాత్కాలిక ఏర్పాటు వృధా ప్రయత్నం అవుతుంది. 80 టి.యం.సిలు ఎత్తిపోతల ద్వారా తరలిస్తే పై రాష్ట్రాలకు 35టి.యం.సిలు, తెలంగాణాకు 16 టి.యం.సిలు నికర జలాలు ఇచ్చుకోవాలి.వరద జలాల తరలింపుకు కోట్లు ఖర్చు పెట్టి నికర జలాలు వదులుకునే పిచ్చి చేష్ట ఎవరికీ లాభదాయకం కాదు. దీనిని తక్షణం విరమించుకోవాలి.



No, sir, this is neither a flood-hit nor a drought-hit area. We are only hit by bad government!

# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
**తులిప్స్ అపార్ట్‌మెంట్స్**
**6-3-655, ప్లాట్ నెం. 407**
**సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక**
**సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082**
accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: 040-23311817

విడి ప్రతి : రు. 10 ,
ఏడాది చందా : రు. 200
మూడేళ్ళ చందా : రు. 500

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్ | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | 2,500 | |
| పూర్తి పేజీ | 5,000 | 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | 10,000 | 20,000 |
| బ్యాక్‌పేజి | - | 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# అవినీతి రహిత సమాజాన్ని స్థాపించాలి

# ఫాక్ట్ సమావేశంలో వక్తలు

సమాజంలో విలువలను పెంపొందించి తద్వారా అవినీతి రహిత సమాజాన్ని స్థాపించాలని జాతీయ వేదిక అధ్యక్షుడు, ఫాక్ట్ సంస్థ వ్యవస్థాపకుడు డీవీవీఎస్ వర్మ పేర్కొన్నారు. జాతీయ వేదిక ఆధ్వర్యంలో స్థానిక ఎస్కేఎస్డీ మహిళా డిగ్రీ కళాశాలలో ఫాక్ట్ (ఫోరం అగైనెస్ట్ కరప్షన్ టు డే) సంస్థ రాష్ట్రవ్యాప్తంగా అవినీతిపై నిర్వహించిన చర్చా వేదికలో ఆయన పాల్గొని మాట్లాడారు. అవినీతిపై పెద్దఎత్తున ఉద్యమం చేయడానికి ఫాక్ట్ సంస్థ ఏర్పాటు చేశామన్నారు. రాజకీయ పార్టీలకతీతంగా అన్ని వర్గాల ప్రజలు కలిసి పోరాడితే అవినీతిని కొంతవరకు పరిష్కరించవచ్చన్నారు. సమాజంలో అవినీతిని ఉదాసీనంగా ఉందని, అవినీతిపరులను ఆరాధిస్తున్నారన్నారు. ప్రస్తుత తరం రాబోయే తరాలకు స్ఫూర్తిగా ఉండాలని చెప్పారు. విద్యార్థులకు సామాజిక విలువలు అందించి అవినీతిరహిత సమాజాన్ని స్థాపించాలన్నారు.

విద్యా సంస్థల యాజమాన్యాలు కీలక పాత్ర పోషించి పాఠ్యాంశంలో భాగంగా కార్యక్రమాన్ని అమలు చేయాలన్నారు. పట్టణ, మండల స్థాయిల్లో సంస్థలు ఏర్పాటు చేసి అన్ని రంగాల్లో పెద్ద ఎత్తున ఉద్యమం తీసుకొస్తామని చెప్పారు. సమావేశానికి అధ్యక్షత వహించిన కళాశాల వ్యవస్థాపకుడు చిట్టూరి సుబ్బారావు మాట్లాడుతూ ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న అతిపెద్ద సమస్య అవినీతి అన్నారు. అంతర్జాలం, ఫేస్‌బుక్, చరవాణిల్లో మునిగిపోయి యువత నిద్రపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వారిలో మార్పు వస్తే అవినీతిని రూపుమాపవచ్చని పేర్కొన్నారు. ఆంధ్రా విశ్వవిద్యాలయం సెనెట్ మాజీ సభ్యుడు గుబ్బల తమ్మయ్య మాట్లాడుతూ అవినీతి అధికారులు, పాలకులను నిలదీయాలన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి డాక్టర్ రమేష్ చంద్రబాబు, మాజీ ఎమ్మెల్యే ముళ్లపూడి వెంకటకృష్ణారావు, పురపాలక మాజీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, డాక్టర్ తాతిన రామబ్రహ్మం, ఎస్.మనోరమ, సోమసుందర్, ప్రగతి రాజా తదితరులు పాల్గొన్నారు.

**రాష్ట్రస్థాయి నూతన కమిటీ ఎన్నిక**

తణుకు ఎస్కేఎస్డీ మహిళా కళాశాలలో ఫాక్ట్ సంస్థ రాష్ట్రస్థాయి కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అతిథులుగా డాక్టర్ పి.చిరంజీవిని కుమారి (కాకినాడ ఐడియల్ సంస్థలు), మెంటే పద్మనాభం (భీమవరం కేజీఆర్ఎల్ సంస్థలు), డాక్టర్ గుబ్బల తమ్మయ్య (ఆంధ్రా విశ్వవిద్యాలయం మాజీ సిండికేట్ సభ్యుడు, తణుకు), చెన్నుపాటి విద్య (విజయవాడ), ఇ.జగన్నాథరావు, (మాజీ జిల్లా న్యాయమూర్తి, శ్రీకాకుళం), అధ్యక్షుడిగా చిట్టూరి సుబ్బారావు (ఎస్కేఎస్డీ విద్యా సంస్థలు, తణుకు), కార్యదర్శిగా బి.రమేష్‌చంద్రబాబు (తణుకు), సభ్యులుగా డాక్టర్ తాతిన రామబ్రహ్మం (తణుకు), ప్రగతి రాజా (తణుకు), డాక్టర్ మెంటే లక్ష్మణరావు (భీమవరం), అక్కినేని కిషోర్ (భీమవరం), ఏఎన్ఎస్ సత్యనారాయణ (తణుకు), డి.సోమసుందర్ (తాడేపల్లిగూడెం), ఆకుల వెంకటేశ్వరరావు (తణుకు), డీవీవీఎస్ వర్మ (తణుకు), కాకర వెంకటేశ్వరరావు (కాకినాడ), డి. విష్ణుమూర్తి (శ్రీకాకుళం), పి.దీపక్ (తాడేపల్లిగూడెం), ఎం.వెంకటేశ్వరరావు (జంగారెడ్డి గూడెం), శ్రావణకుమార్ (తంబళ్లపల్లి, చిత్తూరు), జె.రవి (రాజమండ్రి), ఆర్.చునాత్ (విజయవాడ), మల్లుల వెంకటేశ్వరరావు (నరసాపురం)లను ఎన్నుకొన్నారు.

# విద్యా హక్కు... వీడని చిక్కు!

**డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్**

దేవుడో, ప్రకృతో ప్రసాదించిన అంతర్లీన ప్రతిభాపాటవాలను విద్య ద్వారా సంపూర్ణంగా వికసింపచేసుకుని ఎదిగే అవకాశాన్ని ఒక బిడ్డకు సమాజం ఇవ్వకపోతే- అది కచ్చితంగా క్షమార్హంకాని మహాపాపం! ఈ కొలమానంతో చూస్తే, భారతదేశం ఓ అత్యంత పాప పంకిలమైన దేశం. విద్యారంగంలో బోలెడు విజయాల్ని సాధించామని జబ్బలు చరచుకునే దేశం గురించి ఇలాంటి వ్యాఖ్య చేయటం వింతగా, అనుచితంగా అనిపించవచ్చు. మనకు మన సత్యా నాదేళ్లలు, ఇంద్రా నూయీలు ఉన్నారు. మనకు మన ఐఐటీలు, ఐఐఎంలు ఉన్నాయి. మనకు మన విద్యాహక్కు చట్టం (ఆర్‌టీఈ) ఉంది. దాదాపు దేశంలోని పిల్లలందరూ పాఠశాలల్లో చేరుతున్నారంటూ 96శాతం నమోదును చూపుతున్నాం. ఇంకేంటి మన విద్యావ్యవస్థలో లోపం?



కనీస ప్రమాణాలు కరవు

వాస్తవాల కోసం సాక్ష్యాల్ని పరీక్షించాలి. ఏటా చేసే సర్వేలను మదింపు చేసి 'ప్రథమ్' అనే స్వచ్ఛంద సంస్థ వార్షిక విద్యానివేదిక స్థితి (ఎఎస్ఈఆర్- అసర్) పేరుతో పాఠశాల విద్యపై 2005 నుంచి విలువైన వివరాలు వెల్లడిస్తోంది. భారత్‌లోని 600కి పైగా జిల్లాల్లో గ్రామీణ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులను సర్వే చేసి ఈ నివేదికల్ని రూపొందిస్తారు. ఏయేటికాయేడు 'అసర్' సర్వే వివరాలు మరింత నిక్కచ్చిగా, నిరుత్సాహకరంగా ఉంటున్నాయి. విద్యాహక్కు చట్టం ఈ పరిస్థితుల్ని ఏమాత్రం మార్చలేకపోయింది. బోలెడంత హంగామాతో 2009లో విద్యాహక్కు చట్టం(ఆర్‌టీఈ) తీసుకొచ్చారు. గత పదేళ్లుగా సర్వశిక్షా అభియాన్ కింద పాఠశాలల మౌలిక వసతులు, పిల్లల చేరికను పెంచేందుకు గణనీయ సంఖ్యలో ప్రజాధనాన్ని(రూ. 2.86లక్షలకోట్లు) ఖర్చుపెట్టారు. ఏటా రూ.11వేలకోట్లతో సర్కారీ బడుల్లో మధ్యాహ్న భోజన పథకం ఉంది. వీటికి తోడుగా రాష్ట్రప్రభుత్వాలు బడి చదువు మీద ప్రతి సంవత్సరం భారీ మొత్తాల్ని (సుమారు రెండు లక్షల కోట్లరూపాయలు) ఖర్చు చేస్తున్నాయి. ఇంతచేసినా, ఫలితాలు దిగ్భ్రాంతి కలుగజేస్తాయి. 2007-08 నుంచి నేటికి ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి వరకు పిల్లల నమోదు తొమ్మిది శాతం పడిపోయింది. (13.37కోట్ల నుంచి 12.19కోట్లకు) ఇదే సమయంలో ప్రైవేటు పాఠశాలల్లో పిల్లల నమోదు 40శాతం మేర పెరిగి 5.09కోట్ల నుంచి 7.12కోట్లకు చేరింది.

పేదలపాలిట పెనుభారం

సర్కారీ బడుల్లో ఉన్న పిల్లలు దాదాపు అందరూ పేద

కుటుంబాల నుంచే వచ్చారన్నది ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. ప్రైవేటు పాఠశాలల్లో ఇటీవల పెరిగిన 40శాతం పిల్లలూ ఆ పేద కుటుంబాల నుంచి వచ్చినవారేనని గణాంకాలు చెబుతున్నాయి. పేద తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రైవేటు బడుల్లో చేర్చి జేబులో నుంచి ఫీజులు కడుతున్నారు. ప్రైవేటు రంగాన్ని నీరుగార్చే ప్రత్యేక లక్ష్యంతో కనిపించిన ఆర్‌టీఈ, ఆచరణలోకి వచ్చేసరికి పాఠశాల విద్యలో లైసెన్స్ రాజ్యాన్ని తయారుచేసింది. దాదాపు అసాధ్యమనిపించే మౌలిక వసతుల నిబంధనల్ని ప్రైవేటు రంగంపై విధించి భారీమొత్తంలో నిధుల్ని ప్రభుత్వ రంగంలోకి గుమ్మరించింది. కానీ ఫలితాల్ని నిగ్గుతేలిస్తే, ఆర్‌టీఈ ఉన్నప్పటికీ లక్షలాది పేద కుటుంబాలు తమ ఆదాయాల స్తోమతకు మించి భారీ మొత్తాలను వెచ్చించి తమ పిల్లల్ని ప్రైవేటు పాఠశాలల్లో చేరుస్తున్నారు. పనికొచ్చే చదువు మీద దృష్టి పెట్టని ఆర్‌టీఈ, నిజానికి చేసిందేమిటంటే అన్నిరకాల పరీక్షల్ని నిషేధించటం. పాఠశాలల మధ్య పోటీని, నచ్చిన స్కూలు ఎంపిక అవకాశాన్ని పెంపొందించకుండా ఆ చట్టం ప్రభుత్వ గుత్తాధిపత్యాన్ని సృష్టించే ప్రయత్నం చేసింది. దానివల్ల చివరికి జరిగిందేమిటంటే, పేదపిల్లలు ప్రైవేటు రంగంవైపు మళ్లటం, మొత్తంగా విద్యావ్యవస్థలో ఫలితాలు ఇంకా దిగజారటం.

ఇటువంటి పరిస్థితిలో నాణ్యమైన విద్యకు గట్టి డిమాండ్ ఉండటం, తమ పిల్లల కోసం ఎంత త్యాగానికైనా తల్లిదండ్రులు సిద్ధపడుతుండటం గొప్ప ఆశాజనక పరిణామం. అయితే, కేవలం ప్రైవేటు స్కూళ్లలో పిల్లల సంఖ్య పెరగటం వల్ల మనకు మంచి విద్య అందదు. బోధనా ఖర్చుల కోసం జేబుల్లో నుంచి పెడుతున్న ఖర్చుతో చాలా కుటుంబాలు పేదరికంలోని కూరుకుపోతున్నాయి. అంత త్యాగం చేసినా, చాలామంది పిల్లలకు అర్థవంతమైన పాఠశాల చదువు అందటంలేదు. ఫలితంగా, ఎక్కువమంది 'చదువుకున్న' యువతీయువకుల్లో ఆధునిక ఆర్థిక వ్యవస్థలో ఉద్యోగానికి కావలసిన కనీస నైపుణ్యాలు లోపిస్తున్నాయి. గోతులు తవ్వటం, గుంతలు పూడ్చటంతో మనుషులకు ఆదాయాన్ని పెంచే ఉపాధిని కల్పిస్తున్నామంటూ ఈ 21వ శతాబ్దపు ప్రపంచంలో ఎల్లకాలం నటించలేం. తక్కువ స్థాయి నైపుణ్యాలతో మన ఉత్పాదకత, వేతనాలు కూడా చాలా తక్కువగానే కొనసాగుతాయి. పేదరికం కోట్లాది ప్రజల జీవితాల్ని చిన్నాభిన్నం చేస్తూనే ఉంటుంది. నాణ్యమైన పాఠశాల విద్య నైపుణ్యాలు మాత్రమే పేదరికాన్ని నిర్మూలించి అధిక ఆర్థికాభివృద్ధి రేటును సాధించగలిగినవి. మంచి విద్య నైతికావసరం మాత్రమే కాదు. కీలక ఆర్థికావసరం కూడా!

ప్రతి బిడ్డకూ నిజమైన నాణ్యతతో కూడిన విద్య తప్పనిసరిగా అందేలా చేయటానికి ఏం చేయాలి? పాఠశాల చదువులో ఫలితాలను మెరుగుపరచడానికి ఇప్పుడు ఆర్‌టీఈ పెద్ద అవరోధంలా మారింది. ఈ చట్టం విద్యార్థుల పరిజ్ఞానాన్ని అర్థవంతంగా అంచనా వేయటానికి, పిల్లల మీద ఒత్తిడి లేకుండా విద్యాప్రమాణాలను పరీక్షించటానికి, ప్రభుత్వ-ప్రైవేటు




భాగస్వామ్యం మధ్య తల్లిదండ్రులు నచ్చిన పాఠశాల ఎంపిక చేసుకోటానికి, పేద తల్లిదండ్రులకు ప్రభుత్వమే ఫీజు తిరిగి చెల్లింపు(రీఇంబర్స్) చేయటానికి అవకాశం లేకుండా చేసింది. అయ్యవారిని చేయబోతే ఏదో అయిందనే సామెతకు తాజా నిదర్శనం ఆర్‌టీఈ. విద్యలో నిజమైన ఫలితాలు వచ్చేలా ఈ చట్టాన్ని సవరించాలి. సంస్కరణల్ని

జోడించాలి.

ఆర్టీఈ ఒక అవరోధంగా కాకుండా బలాన్నిచ్చేదిగా, సహాయకారిగా మారాక, ప్రతి బిడ్డకూ తక్కువ ఖర్చుతో నిజమైన చదువు అందేలా ఇంగితజ్ఞానంతో కూడిన విధానాలను, కార్యక్రమాలను రూపొందించుకోవాలి. భారత్‌లోని మూడోవంతు పిల్లలు బాగా చదువు, ఆదాయం ఉన్న కుటుంబాల్లోనివారు, పెద్దస్థాయి ప్రైవేటు స్కూళ్లకు వెళ్తూ, తమ భవిష్యత్తును తామే చూసుకోగలిగినవారు అనుకుందాం. అప్పుడు మిగిలిన పిల్లలకు విద్య కోసం ప్రభుత్వ వనరులు సమస్య కావు. చదువులో నాణ్యతే అసలైన సవాలవుతుంది. పాఠశాల చదువులో ప్రతి బిడ్డ మీదా ప్రభుత్వం ఇప్పుడు ఇరవై నుంచి ఇరవై అయిదువేల రూపాయల వరకు ఖర్చు చేస్తోంది. ఫలితాలు బాగుంటాయని అందరూ మెచ్చుకునే ప్రభుత్వ కేంద్రీయ విద్యాలయాల్లో ప్రతి బిడ్డకూ రూ.27వేలు ఖర్చు పెడుతున్నారు. కాబట్టి మనం పెద్ద ఎక్కువగా అదనపు ఖర్చు చేయకుండానే విద్యలో నాణ్యత పెంచవచ్చు.

దిద్దుబాటు చర్యలు

రెండు కీలక ఏర్పాట్లు చేసుకుంటే విద్యలో కచ్చితంగా మెరుగైన ఫలితాలు సాధించగలం. మొదటిది, అర్థవంతమైన అంచనా పద్ధతులు. ఫలితాలను లెక్కకట్టడానికి విజయాన్ని నిర్వచించి చెప్పటానికి ఒత్తిడి లేని పరీక్షలు. తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పాఠశాల యాజమాన్యాలకు అందరికీ పిల్లల విజయం కావాలి. పరీక్షల్ని నిషేధించటం ద్వారా ఆర్టీఈ ఇప్పుడు 'విజయాన్ని' పరిగణనలోకే తీసుకోవటం లేదు. మనకు పరీక్షలు ఉంటే, అవి దాదాపు ప్రతిసారీ ఒత్తిడిని పెంచేవిగా, బట్టీపట్టి వల్లె వేసేవిగా, కాపీ కొట్టేందుకు పురికొల్పేవిగా ఉంటున్నాయి. అంతేతప్ప వాటిలో సృజనాత్మకత, జీవితంలో అన్వయానికి చోటు ఉండటం లేదు. అర్థవంతమైన పరీక్షలు, అంచనా విధానాన్ని ప్రవేశపెట్టి ఒక నిరంతరాయ కార్యక్రమంలా అమలు చేస్తే ఫలితాలు గణనీయంగా పెరుగుతాయి.

ఇక రెండో ఏర్పాటు, నచ్చిన పాఠశాలను ఎంపిక చేసుకునే అవకాశాన్ని తల్లిదండ్రులకు కల్పించేలా ప్రభుత్వ-ప్రైవేటు పాఠశాలల మధ్య పోటీని ప్రోత్సహించటం. కొన్ని ప్రమాణాలను పాటిస్తూ ఏడాది ఫీజు రూ.18వేల వరకూ ఉండి, మంచి విద్యనిచ్చే అన్ని ప్రైవేటు స్కూళ్లనూ ప్రోత్సహించాలి. వీటిలో లాభాపేక్ష లేనివాటికి ప్రాధాన్యమివ్వాలి. అన్ని పాఠశాలల మధ్యా తమకు నచ్చిన స్కూలును ఎంపిక చేసుకునే అవకాశం తల్లిదండ్రులకు ఇవ్వాలి. ఫీజును ప్రభుత్వమే భరించాలి. ఫలితాల్ని జాగ్రత్తగా పర్యవేక్షించటమే ప్రధానంగా ప్రభుత్వ పాత్ర కావాలి. బడికి వెళ్లడం ఆర్థికభారం కాకుండా ప్రతి బిడ్డకూ రవాణా రాయితీ కూడా అందించాలి. ఇప్పటికీ కోట్ల సంఖ్యలో పేద పిల్లలు ప్రైవేటు స్కూళ్లకోసం దూరప్రాంతాలకు వెళ్లివస్తున్నారు. విద్యార్థుల సామర్థ్యాన్ని అర్థవంతంగా అంచనా వేయటం, నచ్చిన పాఠశాలను ఎంచుకునే అవకాశం ఒక్కసారి విద్యారంగంలో వేళ్లూనుకుంటే, ఫలితాల్లో మౌలిక మార్పు కనిపిస్తుంది. నూటికి 65 పాఠశాలల్లో 50 కంటే తక్కువమంది పిల్లలు, ఇద్దరు మాత్రమే అధ్యాపకులు ఉండి, స్కూళ్లు వెలాతెలా బోతున్నాయి. వాటి స్థానంలో స్కూళ్ల సంఖ్యను తగ్గించి ప్రతి స్కూలులోను 100-150కి తక్కువ కాకుండా పిల్లలు, అయిదుగురికి తక్కువ కాకుండా ఉపాధ్యాయులు, ఇతర సదుపాయాలు ఏర్పరిస్తే ఇప్పటి ఖర్చుతోనే మరింత మంచి విద్యా అందుతుంది. దీంతోపాటు సరైన ఉపాధ్యాయ శిక్షణ, స్వయంప్రతిపత్తిగల జిల్లా విద్యాబోర్డుల ద్వారా అత్యధిక జవాబుదారీతనంతో ప్రక్రియ మరింత బలపడుతుంది.

భారతదేశం ఇప్పుడు సరైన మార్గం కోసం ఎదురుచూస్తున్న సంధి దశలో ఉంది. మన బిడ్డలకు నిజమైన విద్య, నైపుణ్యాల్ని అందించి సంపద సృష్టించే శ్రమశక్తిని తయారుచేయటానికి మనకిదో అపురూప అవకాశం. ఇది మన యువజనాభా బలాన్ని సాకారం చేస్తుంది. మనదేశానికి ఆర్థిక దిగ్గజ స్థానాన్ని అందిస్తుంది. మాకు చదువు కావాలి అని సమాజంలోని అన్ని వర్గాల్లో ఉన్న బలమైన డిమాండును అవకాశంగా మలచుకుని కొద్దిపాటి అదనపు ఖర్చుతోనే విద్యారంగంలో సమూల మార్పు సాధించవచ్చు. ఎప్పుడో రావాల్సిన విప్లవానికి ఇప్పుడు సమయం పరిపక్వమైంది.

⊙

# రికార్డులు ప్రైవేట్ ఆస్తులు కావు

## - డాక్టర్ మాడభూషి శ్రీధర్

మనకు సమాచార హక్కు వచ్చిన తరువాతే మన రికార్డులు దస్తావేజులు సరిగ్గాలేవన్న వాస్తవం వెల్లడైంది. కీలకమైన ఫైళ్లను మాయం చేయడం మామూలై పోయింది. సమాచార హక్కయితే ఉంది కానీ, ఆ సమాచారం ఉన్న ఫైళ్ల మీద మనకు హక్కు లేదు. ఎందుకంటే ఆ ఫైళ్లను కాపాడే బాధ్యత ఎవరికీ లేదు. చట్టాలు పరిశోధనలు కోర్టులు తీర్పులు ఏం చేస్తాయి.. ఫైళ్లు లేకపోతే, కాగితాలు మాయమైతే.

ఈ భారత దేశం మనది. భూమి మనది. నిజమే కానీ ఈ భూమిలో ఏ భాగం ఎవరిది? అంతర్జాతీయ సరిహద్దులే కాదు, పల్లెల్లో కూడా ఏ భూమి ఎవరిదో తెలియదు. భూమి శిస్తు వసూలు చేసేందుకు మాత్రమే పరిమితమైనవి మన పూర్వ ప్రభుత్వాలు. ఆంగ్లేయులు, నిజాం నవాబులు కేవలం పన్నులు వసూలు చేయ డానికి మాత్రమేనా అన్నట్టు పని చేసిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ యంత్రాంగం శిస్తు వసూళ్లకేనన్న మాట. మన జిల్లా అధికారిపేరు కలెక్టర్ అంటే వసూళ్ల అధికారి అని. పరిపాలకుడు అన్న భావంతో మెజిస్ట్రేట్ అని పిలవడం కన్నా మనం కలెక్టర్ అనే మాటకే ప్రాధాన్యం ఇస్తున్నాం. ఒక్కో ఆఫీసులో రోజూ జరిగే పని నోట్స్ రాయడం దానికి ఫైలు నెంబర్ ఇవ్వడం దస్త్రాలకు దస్త్రాలు తయారుచేయడమే. ఎక్కడైనా పాలన అంటే అంతేనేమో. ఆ కాగితాలమీదనే పాలన సాగి పోతూ ఉంటుంది.

రెవిన్యూ శాఖ దగ్గర భూమికి సంబంధించిన దస్తావేజుల చిట్టా ఉంటుంది. ఉండాలి. కానీ ఉంటుందని మనం అనుకుంటున్నాం. మనకు కావలసిన చిట్టా ఉండవచ్చు. కానీ దొరకదు. ఉందోలేదో తెలియదు. పహణిలో వాస్తవాలు సరిగ్గా నమోదు చేయరు. అవి ఏ విధంగా రాస్తారో పాత తరం పట్వారీలు, కరణాలకే తెలుసు. వారి దగ్గరే ఐఏఎస్ అధికారులు రికార్డుల అవగాహన నిర్వహణలో శిక్షణ పొందుతారు. కానీ ఇపుడు వారికి ఆ శిక్షణ ఇచ్చేవారే దొరకడం లేదు. రికార్డులు సరిగ్గా ఉండవు. అవేమిటో అర్థం కాదు, సరిగ్గా లేవని కూడా తెలియవు. సరిచేయడం అంటే



కూడా చెప్పలేము. ఇదీ మన పాలన.

సర్కారు భూములు, ఇనాం భూములు, దేవుడి మాన్యాలు, సర్వీసు భూములు అని రకరకాల భూము లు. సామాన్యుని భూములు కూడా కొన్ని. కాని మన దేశంలో భూమి లేని పేదలే ఎక్కువ. వేలాది ఎకరాల భూములు కైవసం చేసుకున్న సంపన్నులు కూడా ఎక్కువే. ఒక్కొక్క కుటుంబా నికి వేల ఎకరాలు ఉండడం సమానతా హక్కు ఉల్లంఘన అనీ అన్యాయ మనీ భూసంస్కరణలు తెచ్చారు. రెవిన్యూ ఉద్యోగులు లాయర్లు సంపన్ను లైనారు. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచగొండితనం పెంచి పోషించింది భూసంస్కరణలే.

ఎవరో కొందరు తప్ప చాలా మంది పట్వారీలు, కర ణాలు, గిరిదావార్లు, నాయబులు, తాసీల్దార్లు రెవిన్యూ శాఖను భయానకమైన అవినీతి కూపంగా మార్చి వేశారు. ఈ అవినీతి అన్ని శాఖ లకు పాకింది. దున్నే వాడిదే భూమి అన్న నినా దం అమలు కాకముందే కార్పొరేట్ భూ స్వాములు వెలిశారు. సెజ్‌లు వచ్చాయి. ఇప్పుడు రాజధాని

నిర్మాణం కూడా లక్షల కోట్ల రూపాయల భూ వ్యాపారంగా మారబోతున్నదని విమర్శలు కూడా వింటున్నాం.

రికార్డులు రహస్యంగా పెట్టడం లేదా బయట పడే రికార్డులు అయోమయంగా రూపొందించడం ద్వారా పాలకులు, పాలనాధికారులు, ప్రభుత్వోద్యోగులు లంచగొండి తనాన్ని పోషిస్తున్నారు. సురేందర్ పాల్ సింగ్ అని ఢిల్లీ వ్యవసాయదారుడు. తన గ్రామంలో ఎవరి భూములు ఎంతో, వ్యవసాయ భూమి ఎంతో, ప్లాట్లకు ఎన్ని ఎకరాలు కేటాయించారో తెలుసుకుందా మనుకున్నాడు. అందులో ఏదో గందరగోళం ఉందని ఆయన అనుమానం. పొలాల హద్దుల గురించి తెలుసు కోవాలనుకున్నాడు, అందుకు సమాచార హక్కు వినియోగించుకున్నాడు. ప్రజాసమాచార అధికారి కొంత సమాచారం ఇచ్చినా చాలా ఇవ్వలేదు. మొత్తం రికార్డు చూపమని మొదటి అప్పీలు అధికారి ఆదేశించినా విన లేదు. ప్రతి ప్రభుత్వ శాఖలో మొదటి అప్పీలు అధికారి అంటే ఆ శాఖలోని సీనియర్ అధికారి అని చట్టం నిర్దేశించింది. తమ అధికారి ఆదేశాలనే ఆ శాఖ లేదా సమాచార అధికారి పాటించకపోవడం చట్ట ఉల్లంఘన. కానీ అడిగేవారు లేరు.

రెండో అప్పీలు కింద సమాచార కమిషనర్ (ఈ రచయిత) ముందుకు వచ్చారు సురేందర్ పాల్ సింగ్. ఏడాదిన్నర పాటు ఎదురుచూసిన తరువాత రెవిన్యూ శాఖ వారి వివరణ అర్థం ఏమంటే రికార్డు గురించి చెప్పము చూపమూ అని. గ్రామం భూమి రికార్డులో అనేక మంది భూమి యజమానుల వివరాలు ఉన్నాయని, వాటి గురించి చెప్పడం భావ్యం కాదని, అయినా ఆయావ్యక్తుల స్థిరాస్థి వివరాలు వారి వ్యక్తిగత మైనవి కనుక ఇవ్వలేమని, లేదా మూడో వ్యక్తి సమాచారం కనుక ఆ వ్యక్తి అనుమతి ఉంటే తప్ప ఇవ్వకూడదని సమాచారహక్కు చట్టం వివరిస్తున్న దని, వేలాది ప్రైవేటు వ్యక్తుల అనుమతి తీసుకుని సమాచారం ఇవ్వడం సాధ్యంకాదని కనుక ఇవ్వమని అధికారి వివరించారు.

ఢిల్లీ రెవిన్యూ చట్టం 1954 సెక్షన్ 21 ప్రకారం రికార్డ్ ఆఫ్ రైట్స్ ఊళ్లో వ్యవసాయం చేస్తున్న వారు ఇతర వృత్తుల వారి వివరాలు అందులో నమోదు అయి ఉంటాయి. వార్షిక రిజిస్టర్ కూడ తయారు చేయాలి, మార్పులు చేర్పులతో నవీకరించాలి. ఎవరయినా దర ఖాస్తు చేసుకుంటే ఆ రికార్డు సవరించవచ్చు. అందులో ఏముందో తెలియకుండా సవరించాలని ఎవరైనా ఏవిధంగా అభ్యర్థిస్తారు? సెక్షన్ 32 ప్రకారం ఈ చట్టం కింద రూపొందే అన్ని నక్షాలు, పత్రాలు, రికార్డులు, రిజిస్టర్లు ప్రజలకు అందుబాటులో ఉంచాలి. రికార్డు ఆఫీసర్లను నియమించాలి. వారు రికార్డుల నిర్వహణ మార్పులు చేర్పులు చేయడం వంటి పనులు చేయాలి.

రికార్డులు ప్రజలకు అందుబాటులో ఉంచడం అనేది ముఖ్యం. ఇది పాలనా శాస్త్ర నియమం. అదే సమాచార హక్కు చట్టం రూపం దాల్చింది. రెవన్యూ చట్టాలు కూడా ఇవే చెబుతున్నాయి. ఎ పి భూమి హక్కులు పట్టేదారు పాసుపుస్తకాల చట్టం 1971 ప్రకారం రికార్డ్ ఆఫ్ రైట్స్ జనానికి అందుబాటులో ఉండాలని సెక్షన్ 7, ఉచితంగా ప్రజలకు చూపాలని రూల్ 24(2) నిర్దేశిస్తు న్నది. వరంగల్ జిల్లాలో జాయింట్ కలెక్టర్ శ్రీమతి కరుణా వాకాటి ఐఏఎస్ 2011 నవంబర్‌లో భూమి రికార్డులను గోడలమీద రాయాలని నిర్ణయం తీసుకున్నారు.

జిల్లా పెయింటర్ల సంఘంతో ఒప్పందం కూడా కుదుర్చుకున్నారు. జనగామ మండలం గోపరాజపల్లి గ్రామంలో, హసన్‌పర్తి మండలం సూదాన్‌పల్లి గ్రామం లో గోడలమీద పహణి రాయడం వల్ల గ్రామస్తులు రికార్డులో పొరబాట్లను సరిదిద్దాలని కోరడానికి వీల యింది. సవరించారు కూడా. కేంద్ర ప్రభుత్వ పారదర్శ కత జవాబుదారీ వర్కింగ్ గ్రూప్ 2010జూలైలో తన నివేదికలో మహాత్మాగాంధీ గ్రామిణ ఉపాధి గ్యారంటీ పథకం కింద కల్పించిన పని, చేసిన వారు వారికి ఇచ్చిన వేతనాల వివరాలను స్థానికభాషల్లో రాసి అందుబాటులో ఉంచాలని సిఫార్సు చేశారు.

ఈ పద్ధతి ద్వారా 'నరేగా' పథకాల్లో అనేక స్థాయిల్లో ఉన్న లంచ గొండితనాన్ని నివారించకపోతే 39వేల కోట్ల రూపా యల ఖర్చు అదనంగా పెరుగుతుందని ఆ వర్కింగ్ గ్రూప్ తన నివేదికలో పేర్కొన్నారు. సాక్ష్య చట్టం 74, 76 ప్రకారం వీటిని పబ్లిక్ రికార్డులు అని నిర్వచించారు. పబ్లిక్ రికార్డులు అంటేనే ప్రజలకు చెందినవని అర్థం. వాటిని వారికి అందుబాటులో ఉంచడమే న్యాయం.

కనుక భూమి రికార్డులు ప్రజలవి, వారికి అందుబాటులో ఉండాల్సినవి. భూమి సొంతదారుల పేర్లు ఉన్నంత మాత్రాన భూమి రికార్డులు కొందరి ప్రైవేటు ఆస్తి కాదు. వ్యక్తిగతంకాదు, రహస్యం కాదు. సమాచార చట్టం కింద మూడో వ్యక్తి వివరాలు అంతకన్నా కాదు. అభ్యర్థించిన గ్రామ భూముల రికార్డులు ఇవ్వాల్సిందే.

# న్యాయ నియామకాల బిల్లుకు రాష్ట్రపతి ఆమోద ముద్ర

న్యాయమూర్తుల్ని న్యాయమూర్తులే నియమించుకునే కొలీజియం వ్యవస్థ స్థానంలో "జాతీయ న్యాయ నియామకాల కమిషన్" (ఎన్.జె.ఎ.సి.)ని ఏర్పాటు చేయడానికి ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లుకు రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఆమోదం తెలిపారు. 121వ రాజ్యాంగ సవరణ బిల్లును ఈ ఏడాది ఆగస్టులోనే పార్లమెంటు ఆమోదించింది. రాష్ట్రపతి సమ్మతి కూడా లభించడంతో 20 ఏళ్లుగా ఉన్న కొలీజియం స్థానంలో ఎన్.జె.ఎ.సి. ఏర్పాటుకు మార్గం సుగమం అయింది. సుప్రీంకోర్టు, 24 హైకోర్టులకు న్యాయమూర్తుల్ని నియమించడంతో పాటు, వారి బదిలీలను కూడా ఈ కమిషనే చూసుకుంటుంది. భారత ప్రధాన న్యాయమూర్తి నేతృత్వం వహించే ఎన్.జె.ఎ.సి.కి రాజ్యాంగ ప్రతిపత్తి ఉంటుంది. ఆయనతో పాటు సుప్రీంకోర్టుకు చెందిన మరో ఇద్దరు న్యాయమూర్తులు, కేంద్ర న్యాయశాఖ మంత్రి, ఇద్దరు ప్రముఖ వ్యక్తులు దీనిలో ఇతర సభ్యులు. ఈ ఇద్దరు ప్రముఖ వ్యక్తులను ప్రధాని, సి.జె.ఐ, లోక్‌సభలో అతిపెద్ద ప్రతిపక్ష పార్టీ నేత ఎంపిక చేస్తారు. రాజ్యాంగ సవరణ బిల్లుకు 50శాతం రాష్ట్రాల శాసనసభలు ఆమోదం అవసరం కావడంతో ఆ మేరకు కేంద్రం ఈ బిల్లును పంపినప్పుడు 29 రాష్ట్రాల్లో 16 రాష్ట్రాలు తమ ఆమోదం తెలిపాయి. ఈ చట్టం ఎప్పటి నుంచి అమల్లోకి వచ్చేదీ కేంద్రం విడిగా ప్రకటిస్తుంది. తదుపరి కార్యాచరణ నిమిత్తం ప్రధాని నరేంద్ర మోదీతో శుక్రవారం భేటీ కానున్నట్లు న్యాయ శాఖ మంత్రి డి.వి.సదానంద గౌడ తెలిపారు. ఎన్.జె.ఎ.సి. బిల్లు రాజ్యాంగంలో పొందుపరిచిన న్యాయవ్యవస్థ స్వతంత్రతకు భంగం కలిగిస్తుందంటూ దాఖలైన నాలుగు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలను సుప్రీంకోర్టు గతంలో కొట్టివేసింది.

**ఎన్.జె.ఎ.సి. గురించి:** 1993కి ముందు కేంద్ర న్యాయశాఖ మంత్రి న్యాయవ్యవస్థతో సంప్రదించి న్యాయమూర్తుల నియామకాన్ని చేపట్టేవారు. 1993లో కొలీజియం వ్యవస్థ ఏర్పడ్డాక న్యాయమూర్తులే ఇతర న్యాయమూర్తుల్ని నియమించుకునే విధానం అమల్లోకి వచ్చింది. ఈ విధానంపై అనేక విమర్శలూ వ్యక్తమవుతూ వస్తున్న నేపథ్యంలో ఎన్.జె.ఎ.సి. ఆవిర్భవించింది.

**ఏయే విధులు నిర్వర్తిస్తుంది?:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, న్యాయమూర్తులు, 24 హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు, న్యాయమూర్తుల నియామకాలను చేపడుతుంది. న్యాయమూర్తుల బదిలీలూ దీని ద్వారానే జరుగుతాయి.

**నియామకాలు** ఎలా: చట్టం అమల్లోకి వచ్చిన 30 రోజుల్లోగా మొత్తం ఖాళీలను ప్రకటిస్తారు. పదవీకాలం ముగియడం ద్వారా ఏర్పడబోయే ఖాళీల గురించి ప్రభుత్వం ఆరు నెలల ముందుగానే ఈ కమిషన్‌కు సమాచారం పంపిస్తుంది. మరణాలు, రాజీనామాల వల్ల ఆకస్మికంగా ఖాళీలు ఏర్పడితే నెల రోజుల్లోగా ప్రభుత్వం తెలియపరుస్తుంది. అనుభవం, ప్రతిభ, సామర్థ్యం, ఇతర ప్రామాణికాల ఆధారంగా సుప్రీం కోర్టు, హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తుల నియామకానికి పేర్లను ఎన్.జె.ఎ.సి. సిఫార్సు చేస్తుంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకానికీ ఇదే విధంగా చేస్తుంది. హైకోర్టు న్యాయమూర్తుల ఎంపిక కోసం సంబంధిత ప్రధాన న్యాయమూర్తి నుంచి నామినేషన్లు కోరుతుంది. సిఫార్సులు చేసే ముందు ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రి, గవర్నర్‌ల అభిప్రాయాలనూ తీసుకుంటుంది.

**బదిలీలు:** హైకోర్టులు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల బదిలీలకు ఎన్.జె.ఎ.సి. సిఫార్సులు చేస్తుంది.

**ఏకాభిప్రాయం కుదరకపోతే?:** నియామకాలు, బదిలీల్లో సభ్యుల మధ్య ఏకాభిప్రాయం అవసరం. ఏ ఇద్దరు సభ్యులు అంగీకరించకపోయినా ఆ పేర్లను సిఫార్సు చేయరు.

పునః పరిశీలన?: ఎన్.జె.ఎ.సి. నుంచి పేర్లు వచ్చిన తర్వాత పునఃపరిశీలన నిమిత్తం రాష్ట్రపతి వెనక్కి పంపించే వీలుంది. ఆ తర్వాత ఎన్.జె.ఎ.సి. ఏకగ్రీవంగా సిఫార్సు చేస్తే మాత్రం రాష్ట్రపతి ఆ ప్రకారమే ఆమోద ముద్ర వేస్తారు.

# నీతి ఆయోగ్ ఏర్పాటు




ప్రణాళిక సంఘం పేరు "నీతి ఆయోగ్"గా మారింది. ప్రణాళిక సంఘాన్ని రద్దు చేసి, దాని స్థానంలో సరికొత్త వ్యవస్థను తీసుకువస్తామని ప్రధాని నరేంద్ర మోదీ స్వాతంత్ర్యదినోత్సవ ప్రసంగంలో ప్రకటించిన విషయం తెలిసిందే. సమకాలీన ఆర్థిక ప్రపంచానికి తగ్గట్టుగా కొత్త వ్యవస్థ ఉంటుందని ఆయన చెప్పారు. దీనిపై ముఖ్యమంత్రులనూ సమావేశపరిచి, వారి అభిప్రాయాలను ప్రధాని కోరినప్పుడు కాంగ్రెస్ సీఎంలు మినహా మిగిలిన వారంతా పునర్వ్యవస్థీకరణకు అనుకూలంగానే స్పందించారు. ఈ సమావేశం జరిగిన మూడు వారాల తర్వాత పేరు మార్పు గురించి ప్రభుత్వం ప్రకటించింది. "భారత్ పరివర్తనకు జాతీయ సంస్థ" (నేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా-ఎన్.ఐ.టి.ఐ.) సంక్షిప్త రూపమే "నీతి". దీనికి ప్రధానమంత్రి నేతృత్వం వహిస్తారు.

## సమగ్ర స్వరూపం..

- నీతి ఆయోగ్ అధ్యక్షుడు: ప్రధాని.
- ఒక ఉపాధ్యక్షుడు, సీఈవో ఉంటారు.
- అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గవర్నర్లు, కేంద్ర పాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు పాలకమండలిలో ఉంటారు.
- అయిదుగురు పూర్తికాల సభ్యులు, ఇద్దరు పాక్షిక కాల సభ్యులు ఉంటారు. ఈ ఇద్దరినీ ప్రముఖ విశ్వ విద్యాలయాలు, పరిశోధన సంస్థల నుంచి తీసుకుంటారు.
- నలుగురు కేంద్రమంత్రులు తమ పదవిరీత్యా దీనిలో సభ్యులవుతారు. ప్రముఖ ఆర్థికవేత్త అరవింద్ పనగారియా తొలి ఉపాధ్యక్షునిగానియమితులయ్యే అవకాశాలున్నాయి.

## ప్రాంతీయ మండళ్లు

నీతి ఆయోగ్ కింద కొన్ని ప్రాంతీయ మండళ్లు ఏర్పాటవుతాయి. కొన్ని రాష్ట్రాలకు, లేదా ఒక ప్రాంత నిర్దుష్ట అంశాలను ఇవి చూస్తాయి. ఆయా ప్రాంతాల సీఎంలు, గవర్నర్లు దీనిలో సభ్యులుగా ఉంటారు. నీతి ఆయోగ్

అధ్యక్షుడు గానీ, ఆయన నియమించే వ్యక్తి గానీ ఈ మండళ్ల అధ్యక్షులుగా వ్యవహరిస్తారు. నిపుణులను ప్రత్యేక ఆహ్వానితులుగా నియమిస్తారు. సమర్థ పాలన కోసం మంచి ఆలోచనలను ఇవ్వడానికి సంస్థ కృషి చేస్తుంది. కేంద్రం నుంచి రాష్ట్రాలకు విధానాలు వెళ్లే ప్రణాళిక సంఘం స్థానంలో రాష్ట్రాలకు నిజమైన, నిరంతర భాగస్వామ్యం కల్పించడం కొత్త వ్యవస్థ ద్వారా సాధ్యమవుతుందని ప్రధానమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది.

## లక్ష్యాలు...విధులు

బలమైన రాష్ట్రాలతోనే బలమైన దేశం అనే విశ్వాసానికి అనుగుణంగా కీలకమైన విధాన నిర్ణయాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అవసరమైన వ్యూహాత్మక, సాంకేతిక సలహాలను ఈ సంస్థ సమకూరుస్తుంది.

- ఆర్థికాంశాలతో పాటు జాతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యం ఉన్న విషయాలపై సూచనలు చేస్తుంది.
- జాతీయ లక్ష్యాల సాధన కోసం రాష్ట్రాలకు చురుకైన పాత్రను, భాగస్వామ్యాన్ని కల్పిస్తుంది.
- గ్రామస్థాయి నుంచి విశ్వసనీయ ప్రణాళికలను రూపొందింపజేసే యంత్రాంగాన్ని తీర్చిదిద్దుతుంది. వాటి అమలు తీరును పర్యవేక్షిస్తుంది.
- ఆర్థిక వ్యూహాలు, విధానాల్లో జాతీయ భద్రత ప్రయోజనాలు ఉండేలా చూస్తుంది.
- ఆర్థిక పురోగతి నుంచి తగినంత లబ్ధి పొందలేకపోతున్న సామాజిక వర్గాలపై ప్రత్యేక దృష్టి సారిస్తుంది.
- పౌరుల భాగస్వామ్యాన్ని పెంచడం, అందరికీ అవకాశాలు కల్పిండచం, భాగస్వామ్య పాలన, సాంకేతిక వినియోగాన్ని పెంచడం వంటివి దీని లక్ష్యాల్లో ఉన్నాయి.

## ప్రతిపక్షాల పెదవి విరుపు..

ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 1950 మార్చి 15న ఏర్పాటు చేసిన ప్రణాళిక సంఘాన్ని అకస్మాత్తుగా రద్దు చేయడంపై కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. నిజంగా సంస్కరణలు చేయడానికి కాకుండా కేవలం పేరు మార్చడానికే ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోందని కాంగ్రెస్ అధికార ప్రతినిధి అభిషేక్ సింఘ్వి గురువారం విమర్శించారు. నిర్మాణాత్మక సంస్కరణలకు తమ పార్టీ మద్దతు ఇస్తుందని చెప్పారు. కొత్త



వ్యవస్థలో కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలపై వివక్ష చూపే అవకాశం ఉందని మరో అధికార ప్రతినిధి మనీష్ తివారీ అన్నారు. సీపీఎం నేత సీతారాం ఏచూరి స్పందిస్తూ- ప్రణాళిక సంఘం పేరు మార్పును దుర్నీతిగా అభివర్ణించారు. ప్రణాళిక సంఘం స్థానంలో కొత్త వ్యవస్థను తీసుకురావడం వల్ల ఆర్థిక వ్యవస్థ నియంత్రణ తప్పే ప్రమాదం ఉందని గురుదాస్ దాస్‌గుప్తా (సీపీఐ) ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రానికి ప్రణాళికపైనే నమ్మకం లేదన్నారు. ఎలాంటి నియంత్రణ లేని ఆర్థిక వ్యవస్థను ప్రభుత్వం కోరుకొంటోందనీ, ఇది దేశానికి క్షేమం కాదని ఆయన చెప్పారు. సమాఖ్య వ్యవస్థ కింద దేశాభివృద్ధికి నూతన దిశా నిర్దేశం చేయడానికి నీతి ఆయోగ్ ఉపయోగపడుతుందని భాజపా అధికార ప్రతినిధి జి.వి.ఎల్.నరసింహారావు పేర్కొన్నారు.

## అందరికీ అభివృద్ధి ఫలాలు: ప్రధాని మోదీ

రాష్ట్రాల భాగస్వామ్యంతో జాతీయ అభివృద్ధి ప్రాధమ్యాలను నిర్ణయించడానికి ఈ సంస్థ ఉపయోగపడుతుంది. రాష్ట్రాలకు చురుకైన భాగస్వామ్యం కల్పించాల్సిన అవసరం ఉంది. ముఖ్యమంత్రిగా కూడా సేవలందించిన నాకు ఈ విషయం బాగా తెలుసు. ఈ కొత్త సంస్థ ద్వారా ప్రతీ వ్యక్తికీ అభివృద్ధి ఫలాలు అందుతాయి. అన్నింటికీ ఒకే మంత్రం అనే పద్ధతికి చెల్లుచీటీ రాయడం కోసం నీతి ఆయోగ్‌ను ఏర్పాటు చేస్తున్నాం. దేశ బహుళత్వానికి, భిన్నత్వానికి ఇది ప్రతిబింబం.

# సవాళ్లకు సంస్కరణలే.. సై!

మార్గదర్శకులు ఎప్పుడూ ముందుండాలి! లేకపోతే మన గమనం ఎటో తెలియకుండా పోతుంది. దేశ పురోభివృద్ధికి బాటలు పరుస్తూ ఎప్పటికప్పుడు ప్రణాళికలను సిద్ధం చెయ్యాల్సిన ప్రణాళికా సంఘం విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ ఫిర్యాదు ఇదే. ఎప్పుడో 65 ఏళ్ల క్రితం సోషలిస్టు రష్యా ప్రభావంతో జవహర్‌లాల్ నెహ్రూ ఏర్పాటు చేసిన 'ప్రణాళికా సంఘం'.. దాని వ్యవహార శైలి.. సమకాలీన ప్రపంచ పరిస్థితులకు ఏమాత్రం సరిపోయేలా లేదన్నది ప్రధాని బలమైన నమ్మకం. నిజానికి అప్పటికీ- ఇప్పటికీ- ప్రపంచ గమనం ఎంతో మారిపోయింది. మరీముఖ్యంగా ఆర్థిక సరళీకరణలు, ప్రపంచీకరణల ప్రభావంతో ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు రెండూ గణనీయమైన మార్పులకు లోనయ్యాయి. ఇప్పటికీ అదే ప్రణాళికలతో బండిలాగిస్తానంటే మన దారి మనదే, ప్రపంచం దారి ప్రపంచానిదే అన్నట్టు తయారవుతుంది పరిస్థితి! అందుకే ప్రధాని దశాబ్దాలుగా ప్రాచుర్యంలో ఉన్న "యోజన ఆయోగ్ (ప్రణాళిక సంఘం)"కు నిర్ద్వంద్వంగా చెల్లుచీటీ రాసి.. దాని స్థానంలో సరికొత్త దార్శనిక సంస్థ "నీతి ఆయోగ్"ను ప్రతిష్ఠించారు. దీని బాధ్యతలను విఖ్యాత కొలంబియా విశ్వవిద్యాలయ ఆర్థిక శాస్త్రాచార్యుడు అరవింద్ పనగడియా చేతికి అందించారు. సంస్కరణల అనంతరం మారిన పరిస్థితులకు తగ్గట్టుగా దేశానికి అభివృద్ధికర దిశానిర్దేశనం చేసే సత్తా, విస్తృత పరిజ్ఞానం పనగడియాకు దండిగా ఉందని ప్రధాని విశ్వసిస్తున్నారు. ప్రధాని ఇంత బలంగా విశ్వసించటానిక గత కొన్నేళ్లుగా పన గాడియా భారత ఆర్థిక పురోగమనంపై చేస్తున్న వ్యాఖ్యలు, వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలే ప్రధాన కారణం.

**కొలంబియా ఆచార్యుడు!**

62 సంవత్సరాల పనగడియా ప్రస్తుతం అమెరికాలోని విఖ్యాత కొలంబియా విశ్వవిద్యాలయంలో అర్థశాస్త్ర ఆచార్యుడిగా పనిచేస్తున్నారు. 1971లో రాజస్థాన్ యూనివర్సిటీ నుంచి బీఏ పట్టా తీసుకున్న పనగడియా ఆ తర్వాత ప్రిన్స్‌టన్ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చేశారు. గతంలో ఆసియా అభివృద్ధి బ్యాంకుకు ముఖ్య ఆర్థికవేత్తగా వ్యవహరించారు. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు వంటి సంస్థలతో కలిసి పని చేశారు. ముఖ్యంగా- మరో ప్రముఖ కొలంబియా ఆర్థిక శాస్త్రాచార్యుడు జగదీష్ భగవతితో కలిసి భారత రాజకీయార్థిక వ్యవహారాలను విస్తృతంగా



అధ్యయనం చేశారు, వీరివరూ "వై గ్రోత్ మ్యాటర్స్" పేరుతో ఒక పుస్తకం కూడా రాశారు. నేటి భారత ఆర్థిక గమనం సరైన దారిలో లేదని పనగడియా చాలాకాలంగా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 2008లో ఈయన రాసిన "ఇండియా: ద ఎమర్జింగ్ గెయింట్" అన్న పుస్తకం ఒక రకంగా సమకాలీన భారత ఆర్థిక రంగాన్ని ఏయే రంగాల్లో ఎలా సంస్కరిస్తే బాగుంటుందో కూలంకషంగా చర్చిస్తుంది. కొంతకాలంగా ఆర్థిక విధానాల విషయంలో భాజపాకు సలహాలందిస్తున్న పనగడియా ఆర్థిక పత్రికల్లో కొంతకాలంగా వరసగా రంగాల వారీగా తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. భారత దేశాన్ని ప్రగతిపథంలోకి తీసుకుపోవటమెలాగన్న దానిపై బ్లూమ్‌బెర్గ్

టీవీ ఇండియాలో ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని కూడా నడిపారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాని నరేంద్రమోదీ అఖండ మెజారిటీతో గెలవగానే.. సాహసోపేతమైన సంస్కరణలకు సమయం ఇదే అంటూ పత్రికా ముఖంగా బహిరంగ లేఖ రాశారు. దీనిలో "ప్రధాని నరేంద్రమోదీ అనగానే ప్రజలకు చటుక్కున దార్శనికత, సమర్థపాలన అన్నవి రెండూ గుర్తుకొస్తాయి. ఈ రెండూ చాలా ముఖ్యం. అయితే కచ్చితమైన విధాన ప్రణాళిక అన్నది లేకపోతే ఆ రెండే 125 కోట్ల మంది భారతీయుల ఆశలను తీర్చలేవు. మీ నుంచి ప్రజలు విధానపరమై సంస్కరణలు ఆశిస్తున్నారు" అంటూ ప్రధానికి ప్రత్యేకంగా గుర్తు చేశారు. ప్రస్తుతం ఉన్న కార్మిక, భూ చట్టాల్లో కీలకమైన సంస్కరణలు అవసరమన్నది పనగడియా అభిప్రాయం. వీటిని సంస్కరించటమన్నది ఒక్క కేంద్రమే చెయ్యగలిగిన పని కాదని, ఈ విషయంలో రాష్ట్రాల సహకారం, భాగస్వామ్యం చాలా అవసరమని ఆయన అభిప్రాయపడుతున్నారు. కేంద్రమే నిధులు మంజూరు చెయ్యటం, వాటితో ఏం చెయ్యాలో కేంద్రమే నిర్దేశించటమన్న "ప్రణాళికా సంఘం"తీరును ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రంగా నిరసిస్తూ 'సహకార సమాఖ్య' స్ఫూర్తితో రాష్ట్రాలకు మరింత భాగస్వామ్యాన్నీ, బాధ్యతలనూ కల్పిం చాలని అభిప్రాయపడుతుండటం వెనక అరవింద్ పనగడియా ప్రభావం బలంగా ఉంది.

**వేగం అవసరం**

"నీతి" అంటే "నేషనల్ ఇనిస్టిట్యూషన్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా (ఎన్ఐటీఐ-నీతి)". కావటానికి ప్రణాళికా సంఘం స్థానంలో ఏర్పడిందే అయినా.. నిజానికి ఈ సంస్థకు అప్పగించిన విధుల పరిధి చాలా విస్తృతంగా ఉంది. ముఖ్యంగా భవిష్యత్ భారతాన్ని దర్శింపజేసేంతటి కీలకమైన బాధ్యత దీనికి అప్పగించారు. ఒకప్పటిలా నత్తనడక విధానాలు నేటి కాలానికి పనికిరావని ప్రధానీ నమ్ముతున్నారు, పనగడియా కూడా అదే చెబుతున్నారు. సంస్కరణల ఫలాలు తమ వరకూ వచ్చేందుకు ఒకప్పటి తరంలా నేటి తరం వేచి చూసే పరిస్థితి లేదని, వేగవంతమైన సంస్కరణలతో సత్వర ఫలితాలు సాధించాలని పనగడియా అభిప్రాయపడుతున్నారు. కేంద్రం సారధ్యంలో కార్మిక, భూ చట్టాలను సత్వరమే సంస్కరించాలన్నది పనగడియా అభిప్రాయం. ఉత్పాదన రంగంలో ప్రైవేటు రంగానికి బలమైన పాత్ర ఇస్తేనే ఉపాధి రంగం విస్తరిస్తుందని ఆయన వాదిస్తున్నారు. ఇందుకు ఉదాహరణగా చైనా కంపెనీ 'ఫాక్స్‌కాన్'ను తరచూ ఆయన ప్రస్తావిస్తారు. 'ఫాక్స్‌కాన్ అనే చైనా సంస్థ ప్రపంచ ప్రఖ్యాత అమెరికా సంస్థలు ఆపిల్, డెల్ మొదలుకొని జపాన్‌కు చెందిన సోనీ వరకూ అన్ని దేశాల సంస్థలకూ ఉత్పత్తి చేసిపెడుతుంది. ఫాక్స్‌కాన్ ఒక్కటే 13 లక్షల మందికి ఉపాధి కల్పిస్తోంది, పైగా తమ ఉద్యోగులకు గంటకు 3 డాలర్లు (సుమారు రూ.200) చెల్లిస్తోంది. అవును, గంటకు 3 డాలర్లు! వచ్చే పదేళ్లలో మన దేశంలో ఫాక్స్‌కాన్ వంటి సంస్థలు ఎందుకు రాకూడదు?" అన్నది ఆయన బలమైన వాదన. పనగడియా ప్రాథమ్యాల జాబితా చూస్తే- సానుకూల పర్యావరణ విధానం, సత్వర నిర్ణయాలకు అనువైన వాతావరణం, బ్యాంకులను చక్కదిద్దటం, ప్రభుత్వ వాటాలను పునర్వ్యవస్థీకరించటం, రాష్ట్రాలకు సాధికారంగా నిర్ణయాలు తీసుకునే అవకాశాన్ని కల్పించటం.. ఇలా చాలానే ఉన్నాయి. సంఘటిత రంగంలో ఉపాధి కల్పన, చక్కటి విద్యుత్ సరఫరా.. దేశాభివృద్ధికి ఈ రెండూ కీలకమని ఆయన వాదిస్తున్నారు. అధికారాన్ని వికేంద్రీకరించటం, రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కలిసి పని చేయటం, కేంద్రం రాష్ట్రాలకు కొంత స్వేచ్ఛ ఇవ్వటం వంటివన్నీ చాలా అవసరమన్నది ఆయన అభిప్రాయం.

పన్నుల సంస్కరణ, రాయితీలను పునర్వ్యవస్థీకరించటం, అద్భుత మౌలిక వసతుల కల్పనతో రవాణా రంగాన్ని చక్కదిద్దటం, వైద్యం-తాగునీరు-పారిశుధ్యం వంటివాటి విషయంలో అన్నింటినీ ప్రభుత్వమే నెత్తినెత్తుకోకుండా భాగస్వాములను పెంచటం వంటివన్నీ పనగడియా తరచూ విస్తృతంగా చర్చించే అంశాలు! ఇప్పుడు కీలక దిశానిర్దేశన పీఠం తన చేతిలోనే ఉండటం, ప్రధాని మోదీ కావాలని మరీ ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించిన నేపథ్యంలో ఆయన ఎటువంటి మార్పులకు శ్రీకారం చుడతారో వేచి చూడాల్సిందే! ⊙



తణుకులో ఫ్యాక్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న పలువురు ప్రముఖులు




'రాజధాని నిర్మాణం - పారదర్శకత' అనే అంశంపై విజయవాడలో నిర్వహించిన సదస్సులో ప్రసంగిస్తున్న విజయ్‌బాబు

# గ్లోబల్ టెండర్లతోనే రాజధాని నిర్మాణం


## స.హ.చట్టం కమిషనరు విజయబాబు

'నగరంలో నిర్మాణ దశలోనే ఉన్న ఒక పైవంతెన కుప్పకూలింది. దీనికి సంబంధించిన టెండర్లు, గుత్తేదారు పరిస్థితి నేటి వరకు చాలా మందికి తెలియదు. అలాంటిది ఎంతో బృహత్తరమైన రాజధాని నిర్మాణం విషయంలో ఇంకా ఎంత అప్రమత్తంగా ఉండాలో ఆలోచించాలి. కొత్త రాజధాని నిర్మాణ్యానికి గ్లోబల్ టెండర్లను పిలవడమే జవాబుదారీతనంగా ఉంటుంది' అన్నారు రాష్ట్ర స.హ.చట్టం కమిషనరు పి.విజయబాబు. 'రాజధాని నిర్మాణం – పారదర్శకత' అనే అంశంపై విజయవాడలోని వైట్‌హౌస్ భవనంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సదస్సుకు విజయబాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజధాని నిర్మాణం విషయంలో గోప్యత తగదన్నారు. ప్రజలు వేగులై, ఐకమత్యంగా వ్యవహరించాలన్నారు. రాజధాని అంటే కేవలం భవనాల నిర్మాణం కాదని, సింగపూర్, జపాన్‌లలో ఉన్నట్టుగా పౌరుల్లో కూడా చైతన్యం రావాలన్నారు. విచ్చలవిడిగా బ్యానర్లు కట్టి పర్యావరణాన్ని దెబ్బతీయడం, క్యాన్సర్ తదితర వ్యాధులకు కారణం కావడం, పాన్ పరాగ్‌లు, కిళ్లీలు నమిలి ఎక్కడపడితే అక్కడ ఉమ్మి వేయడం, సిగిరెట్లు తాగి పడేయడం వంటి చర్యలు తగవన్నారు. రాజధాని విషయంలో విమర్శలు, సమర్ధన రెండూ తప్పే, వైరుధ్యాలు, అభిప్రాయ బేధాలు పక్కన పెట్టి ఒక మంచి కార్యక్రమం కోసం కలసి పనిచేయాలని పిలుపునిచ్చారు. లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు డీవీవీఎస్ వర్మ మాట్లాడుతూ ప్రపంచంలో నగరాలను నిర్మించుకుంది ప్రజలే, వీటిని ప్రభుత్వాలు ఏర్పాటు చేయలేదన్నారు. హైదరాబాద్‌కు 400 ఏళ్ల చరిత్ర ఉన్న విషయాన్ని మరవరాదన్నారు. భూ సేకరణకు చట్టం ఉంది, సమీకరణకే చట్టం లేదు, ఇది కేవలం నోటి మాటే అన్నారు. సింగపూర్ వాళ్లు గగన విహారంలోనే భూములను చూడడం శోచనీయం, 64 పాళ్ల అవినీతి ఉన్న మనదేశంలో సింగపూర్ వాళ్లు తిరిగితే, ఈ మచ్చ వారికి అంటుతుందేమోనని చమత్కరించారు. రాజధాని చుట్టూ ఎన్నో రహస్యాలున్నాయి, చీకటి కోణం ఉంది, దీన్ని స.హ.చట్టం ద్వారా చేధించే అవకాశాన్ని కల్పించాలని వర్మ డిమాండు చేశారు. వైకాపా ట్రేడ్ యూనియన్ నాయకుడు పి.గౌతంరెడ్డి మాట్లాడుతూ రాజధాని అంతటినీ తుళ్లూరు పరిసరాల్లో నిర్మిస్తే మురుగునీటి పారుదల లేక కృష్ణా నది పెద్ద తరహా డ్రెయినుగా మారుతుందన్నారు. నదీతీరం మెత్తటి నేల కావడం వల్ల భవనాల నిర్మాణం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. కూరగాయల కొరత ఏర్పడి, అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తుందన్నారు. ఈ క్రమంలో కొద్దిపాటి నిర్మాణాలనే గుంటూరు జిల్లాలోని నదీ తీరంలో చేపట్టాలన్నారు. తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ రాజధాని విషయంలో ఏవైనా అనుమానాలు ఉంటే నివృత్తి చేసుకోవాలే తప్ప, గందరగోళం సృష్టించకూడదన్నారు. విమర్శలు మాని సూచనలు చేయాలన్నారు. మాజీ మేయర్ జంధ్యాల శంకర్ మాట్లాడుతూ ప్రజలందరికీ రాజధానితో పని ఉండదని, ఎక్కువగా జిల్లా స్థాయిలోనే పనులు పూర్తవుతాయన్నారు. రాజధాని నిర్మాణంలో పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. స.హ.చట్టం కార్యకర్తలు సమయపాలనను పాటించాలని హితవు చెప్పారు. న్యాయవాది ఎ.ఎస్.ఎన్. రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ నేటి కృష్ణా నది రేపటి మూసీ నదీ కావచ్చు, పొలాలన్నీ పోతే అమెరికా నుంచి ఆహారం దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి రావచ్చన్నారు. రాజధాని నిర్మాణాలు స.హ.చట్టం పరిధిలోని తేవాలని కోరారు. వీవీఆర్ కృష్ణంరాజు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో కృష్ణా డెల్టా పరిరక్షణ సమితి నేత కొలనుకొండ శివాజీ, బీజేపీ అధ్యక్షుడు సంపర శ్రీనివాసరావు, సామాజిక కార్యకర్త తాడికొండ విజయలక్ష్మి, యునైటెడ్ ఫోరం కన్వీనరు వి.సత్యనారాయణ, రైతులు బోసురెడ్డి, అనుమోలు గాంధీ పాల్గొన్నారు.

# అనంతపురం జిల్లా బస్సు ప్రమాదం పట్ల జేపీ దిగ్భ్రాంతి

అనంతపురం జిల్లా మడకశిర-పెనుకొండ మార్గంలో బుధవారం జరిగిన ఘోర బస్సు ప్రమాదం పట్ల లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతుల్లో పలువురు విద్యార్థులుండటం కలచివేస్తోందన్నారు. ఆ మార్గంలో తరచూ ఇలాంటి ప్రమాద ఘటనలు జరుగుతున్నా పాలకులు, అధికారులు మేలుకోలేదన్నారు.

మనదేశంలో ఏటా లక్షమందికి పైగా రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని, వారిలో అత్యధికులు యువత, ముక్కుపచ్చలారనివారేనని ఆవేదన వ్యక్తం చేశారు. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా ఇప్పటికీ ప్రభుత్వాలు హైవే సేఫ్టీ అథారిటీని ఏర్పాటు చేయలేదన్నారు. ప్రతి ప్రయాణీకుని భద్రతనూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యాంశంగా తీసుకోవాలని, డ్రైవర్ల శిక్షణ, స్పీడ్ గవర్నర్ల ఏర్పాటు నుంచి రహదారుల భద్రతకు సమగ్ర చర్యల్ని యుద్ధప్రాతిపదికన చేపట్టాలని డిమాండ్ చేశారు. బాధితుల కుటుంబాలకు జేపీ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రభుత్వం వారికి ఆర్థిక సాయం అందించి అండగా నిలవాలన్నారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



# ఆర్థికాభివృద్ధి, మానవాభివృద్ధి, పరిపాలనకు
## 'నీతి ఆయోగ్' మార్గసూచినివ్వాలి: జేపీ

కేంద్ర ప్రణాళికా సంఘం స్థానంలో కొత్తగా ఏర్పాటైన 'నీతి ఆయోగ్'లో నియమితులైన అరవింద్ పనగడియా, బిబేక్ దేబ్రాయ్, వి.కె సారస్వత్ ఆ పదవులకు యోగ్యులని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. నూతన ఆవిష్కరణలకు కావలసిన పరిజ్ఞానం, స్పష్టమైన అవగాహన వారికి ఉన్నాయన్నారు. ఆర్థిక విధానాలతోపాటు అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, చట్టబద్ధ పాలన, పరిపాలనా సంస్కరణలపై కూడా భారత్ దృష్టి పెట్టాలన్నారు. ఆర్థికాభివృద్ధి, మానవాభివృద్ధి, పరిపాలన ఈ మూడు కీలక రంగాలలో రోడ్ మ్యాప్ ఇచ్చేలా నీతి ఆయోగ్‌ని బలోపేతం చేయాలని జేపీ అన్నారు. ఈ మూడు స్థూల రంగాలలో సంస్కరణలు, సమ్మిళిత పనితీరు, అంతర్గత విభాగాల మధ్య సమన్వయం, కార్యక్రమాల పర్యవేక్షణ మీద ప్రధానంగా దృష్టి ఉండాలన్నారు. వ్యవస్థలను నిర్మించి ఫలితాలు సాధించిన అత్యుత్తమ విధానాలను అనుసరించేలా ప్రోత్సహించటం ఈవేళ భారతదేశ పాలనారంగం ముందున్న సవాలని జేపీ అన్నారు.

# ప్రభుత్వ గుత్తాధిపత్యం కోసం కార్మికులు ఒత్తిడి చేయలేరు

బొగ్గు రంగంలో సమ్మె ప్రభుత్వ గుత్తాధిపత్యం వల్ల తలెత్తే ప్రమాదానికి అద్దం పడుతోందని జేపీ అన్నారు. భారత్‌లో ప్రభుత్వాలు అనేక రంగాలను నెత్తికెత్తుకుని కీలకమైన మౌలిక వసతులు, చట్టబద్ధ పాలన, ప్రభుత్వ కార్యాలయాల్లో నాణ్యమైన పౌరసేవలు, కనీస వసతులు, విద్య, ఆరోగ్యం రంగాలను నాశనం చేస్తున్నాయని, దేశాన్ని వెనక్కి నెడుతున్నాయని అన్నారు. బొగ్గు సమ్మె పార్టీల మధ్య రాజకీయ క్రీడగా మారకుండా మనమంతా గొంతు విప్పాలన్నారు. కార్మికులకు – దేశానికీ మధ్య ఘర్షణ తప్పుడు సంకేతమన్నారు. కార్మికులకు న్యాయమైన వేతనాలు, వసతులు ఇవ్వాల్సిందేనని, అయితే ఒకసారి తమకు జీవనభద్రత చేకూరాక ఏ రంగం మీదైనా ప్రభుత్వ గుత్తాధిపత్యం ఉండాలని వారు ఒత్తిడి చేయలేరని అన్నారు.

ప్రజలే తొలి ప్రాథమ్యమని ప్రభుత్వరంగ కార్మికులు గుర్తించాలని, మనదేశంలో సంఘటితరంగంలో ఉన్న వారి సంఖ్య ఇప్పటికీ 8శాతమేనని, అభివృద్ధి, ఉద్యోగాలు, లక్షలమందిని సంఘటిత రంగంలోకి తీసుకురావటం మన లక్ష్యం కావాలని జేపీ అన్నారు. ఏటా మనకి 18 కోట్ల టన్నుల బొగ్గు కొరత ఉండటం వల్ల విద్యుత్ కోతలు పెరిగి ఆర్థికాభివృద్ధి కుంటుపడిందని, ఈ పరిస్థితిని మార్చాలని, బొగ్గు సమ్మెను వెంటనే ఆపాలని అన్నారు. పెట్టుబడుల ఉపసంహరణ ప్రజల కోసమని, దాని మీద పార్లమెంటు నిర్ణయం తీసుకోవాలని, కార్మికులు తమ హక్కులను పరిరక్షించుకోవాలి తప్ప ప్రభుత్వ విధానాన్ని నిర్ణయించలేరని స్పష్టంచేశారు.

ప్రభుత్వం పార్టీల, ఉద్యోగుల సొత్తు కాదని, ప్రజలు, పన్ను చెల్లించేవారి సొంతమన్నారు. ప్రజల ఆస్తులకు ధర్మకర్తలుగా ఉండే ప్రభుత్వానికి జనం సొమ్ముని ఇష్టమొచ్చినట్టు పందేరం చేసే అధికారం లేదన్నారు. సర్కారీ సంస్థలు ప్రభుత్వంలోని వ్యక్తుల ప్రైవేటు ఆస్తులుగా మారాయన్నది పచ్చి వాస్తవమని, ఈ నేపథ్యంలోనే ప్రభుత్వమా? ప్రైవేటా? అనే మీమాంస కాకుండా సంస్థలు ప్రజాప్రయోజనం దిశగా తమ లక్ష్యాలను నెరవేరుస్తున్నాయా, లేదా అన్నదే ఆలోచించాలన్నారు. "ఎలకల్ని పడుతున్నంత వరకూ పిల్లి నల్లదా, తెల్లదా చర్చ అనవసరం" అని డెంగ్ జియావోపెంగ్ చెప్పినట్టు, ఫలితాల మీదే మనం దృష్టిని కేంద్రీకరించాలి అని జేపీ అన్నారు.

# పోలవరం ప్రాజెక్ట్ పూర్తికే ప్రాధాన్యం

పోలవరం ప్రాజెక్టు సాధనకై దశాబ్దాల కాలం నాటి పోరాటం ఫలించి ప్రాజెక్టు కల సాకారమయ్యే సమయం చేరువలోనే ఉంది. అనేక ప్రయోజనాలు ఒనగూర్చే ఈ ప్రాజెక్టు దేశానికే వరం, రాష్ట్రానికి లైఫ్‌లైన్ (జీవనాడి). ఇది గోదావరి పై నిర్మించే టెర్మినల్ రిజర్వాయర్. దీనిద్వారా కృష్ణా, గోదావరి డెల్టాలతో పాటు అప్‌ల్యాండ్‌లోని నలభై లక్షల ఎకరాలకు, ఉత్తరాంధ్రలోని ఎనిమిది లక్షల ఎకరాలు, నాగార్జునసాగర్ ఆయకట్టు (ఆంధ్ర -తెలంగాణలో 16 లక్షల ఎకరాలు - మొత్తం 67 లక్షల)కు సాగునీరు అందించే ప్రాజెక్టు. విశాఖ నగరంతో పాటు అనేక పట్టణాలు, వేలాది గ్రామాలకు తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు నీరు అందించడంతో పాటు 960 మెగా వాట్ల విద్యుత్ అందించే బహుళార్థక సాధక ప్రాజెక్టు.

పోలవరం ప్రాజెక్టుకు దాదాపు అన్ని అనుమతులు లభించాయి. కేంద్ర ప్రభుత్వ పట్టుదలతోముంపు గ్రామాలను ఆంధ్రప్రదేశ్‌లో చేర్చారు. ప్రాజెక్టు అథారిటీ ఏర్పాటైంది. సీఈవో నియమితులయ్యారు. జాతీయ ప్రాజెక్టుగా చేపట్టబడి ప్రాజెక్టు వ్యయం కేంద్ర ప్రభుత్వమే భరించే విధంగా ప్రణాళికా సిద్ధమయింది. నదుల అనుసంధానంలో భాగంగా దేశంలోనే మొదటి ప్రాజెక్టుగా గుర్తించబడినది. కుడికాలువలో 70శాతం, హెడ్‌వర్క్స్‌లోని టన్నెల్స్, శాడిల్ డ్యామ్ రెగ్యులేటర్లు 80శాతం, స్పిల్‌వే 10శాతం, పునరావాసం, భూసేకరణ 50శాతం జరిగినది. పని నెమ్మదిగా జరుగురుచన్నది. కాంట్రాక్టర్‌పై ఒత్తిడి చేస్తే 2018 జూలై నాటికి పూర్తయ్యే అవకాశం ఉంది. ప్రాజెక్టు ముంపు బాధితులకు అధిక లబ్ధి చేకూరే విధంగా పునరావాసం కల్పించేందుకు ప్రాధాన్యతనివ్వాలి.

ఈ తరుణంలో కృష్ణా డెల్టాకు కొంతమేర త్వరితగతిన ప్రయోజనం చేకూరాలని గోదావరి నుంచి 100 వరద రోజుల్లో 70టీఎంసీల నీటిని పట్టిసీమ వద్ద రోజుకుల 8500 క్యూసెక్కుల నీటిని 30 సంస్థల ద్వారా (కుడి కాలువ 3.5కిమీ లోనికి) ఎత్తిపోసే విధంగా 1300 కోట్ల వ్యయంతో ప్రణాళిక తయారై జీవో విడుదలైంది. కానీ పోలవరం కుడికాలువ ఇంకా 36 కిమీ తవ్వాలి. రైతులు ఎలైన్‌మెంట్ మార్పుపై హైకోర్టుకు వెళ్లారు. కోర్టు వివాదాలు పరిష్కారం అయిన తర్వాత కొత్త భూ సేకరణ చట్టం ప్రకారం భూసేకరణ జరగాలి. ఏడేళ్లనాటి రేట్లతోనే కాంట్రాక్టర్లు పని చేస్తారా? అనే విషయాన్ని పరిశీలించాలి. ఇంకా 150 చిన్న, పెద్ద కట్టడాలు, రామిలేరు, తమ్మిలేరుపై పెద్ద ఆక్విడెక్ట్‌లను నిర్మించాలి. దీనితో పాటు ఎత్తిపోతల పథకానికి 15వరసల పైపుల ఏర్పాటుకు 300 ఎకరాల భూమి సేకరణ జరగాలి. 150 మెగావాట్ల విద్యుత్ కావాలి. 11 సంవత్సరాల క్రితం మొదలైన తాటిపూడి ఎత్తిపోతల పథకం ద్వారా 40 శాతం ఆయకట్టుకు సాగునీరు అందించగలిగారు. పదకొండేళ్ల క్రితం మొదలైన చింతపూడి ఎత్తిపోతల పథకానికి కనీసం ఒక పంపు కూడా ఏర్పాటు చేయుటకు ప్రయత్నం చేయలేదు అనే విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి.

ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద గత 36ఏళ్లుగా రోజువారీ ఇన్‌ఫ్లోస్ (నీటి చేరిక) వివరాలు పరిశీలిస్తే గత పన్నెండేళ్ల కాలంలో గోదావరిలో అక్టోబర్ నుంచి నీటి ప్రవాహం గణనీయంగా తగ్గిపోతోంది. జూలై15 నుంచి సెప్టెంబర్ ఆఖరి వరకు మాత్రమే 70-75రోజుల కాలంలో వరద ఉధృతి ఉంటోం ది. గోదావరి వరద నీటి లభ్యత, కృష్ణానదిలో ప్రవాహం, డెల్టా అవసరాలను బట్టి గోదావరి నీటిని తరలించాల్సి ఉంటుంది. (నీటిని నిలువ చేసే రిజర్వాయర్ లేనందున).

కుడికాలువ ద్వారా కృష్ణాడెల్టాకు నీరు తరలిస్తూ ఉంటే కుడికాలువ ఆయకట్టు మూడు లక్షల ఎకరాల రైతులు తమ పొలాలలకు నీరు ఇవ్వకుండా కృష్ణా డెల్టాకు నీరు తరలించుటకు అంగీకరిస్తారా? సంవత్సరాల తరబడి నిర్మాణంలో ఉన్న తాటిపూడి,చింతలపూడి లిఫ్ట్‌ద్వారా సాగునీరు అందుతుందని ఆశిస్తున్న పశ్చిమగోదావరి మెట్ట రైతలు కృష్ణా డెట్టాకు నీటి తరలింపును ఏ విధంగా భావిస్తారు. ఎడమకాలువకు కూడా లిఫ్ట్‌ద్వారా నీరు అందించాలనే డిమాండును ఇప్పటికే విశాఖపట్నం ప్రజలు లేవనెత్తారు. కుడికాలువ ప్రస్తుత పరిస్తితి ప్రకారం 2017 జూన్‌లోపు నీరు తలించే అవకాశం లేనేలేదు. ఒకవేళ కృష్ణానదిలోకి తరలించినా శ్రీశైలం ద్వారా రాయలసీమ ప్రాజెక్టులకు ఏ మేరకు వినియోగించుకోగలం అని ముందుగా పరిశీలించాలి.

రాయలసీమకు నీరు తరలించే ప్రధాన మార్గం పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్, 1680 కి.మీ. పొడవుగల ప్రధాన కాలువద్వారానే. ఇటీవల పనుల ప్రత్యక్ష పరిశీలనలో అనేక అంశాలు రైతు సంఘాల నేతలను నివ్వెరపరిచాయి. ప్రస్తుతమున్న రెగ్యులేటర్

(1150క్యూసెక్కులు)కు అదనంగా 44,000 క్యూసెక్కులు నీటి విడుదల కోసం 2005లో మొదలైన రెగ్యులేటర్ నిర్మాణం పూర్తికాలేదు. 3.7కిమీ పొడవైన అప్రోచ్ ఛానెల్ 95శాతం పూర్తయింది. కానీ ప్రధాన కాలువపై నాలుగ వంతెనలు నిర్మించాల్సినచోట కాలువ తవ్వకం చేపట్టలేదు. పనిలో 90శాతం పూర్తయినప్పటికీ నీటి ప్రవాహ స్థోమత 210శాతం కూడా పెరగకపోవడం వలన బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ వద్దకు వరద కాలంలో కూడా 12,000 నుంచి 14,000కు మించలేదు. బనకచర్ల వద్ద కుడివైపు ఏర్పాటు చేసిన రెగ్యులేద్వారా శ్రీశైలం రైట్ బ్రాంచ్ కాలువ (ఎస్ఆర్‌బీసీ) గాలేరు నగరి ప్రాజెక్టులకు, అలాగే ఎడమవైపు రెగ్యులేటర్ ద్వారా తెలుగు గంగకు, మధ్యలోగల రెగ్యులేటర్ నుంచి నిప్పులవాగు, కుందూ నదుల ద్వారా పెన్నానదిలోకి చేరి సోమశిల, కండలేరు జలాశయాలలోనికి నీరు చేరుతుంది. కేసీ కెనాల్‌కు కూడా దీని నుంచే కొంతమేరకు నీరు విడుదలౌతుంది. పై ప్రాజెక్టులు తెలుగు గంగ, ఎస్ఆర్‌బీసీ, గాలేరు, నగరి ప్రాజెక్టులకు వేలాది కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. ప్రాజెక్టు కూడా పూర్తిస్థాయిలో పూర్తి కాలేదు. గాలేరు, నగరి బైపాస్‌కాలువ, గోరకల్లు, అవుకు, గండికోట రిజర్వాయర్లు పూర్తికాలేదు. 70 నుంచి 90శాతం నిధులు ఖర్చు అయినప్పటికీ చేకూరే ప్రయోజనాలు 10శాతం నుంచి 20శాతం మాత్రమే.

ముందుగా రాయలసీమ ప్రాంతాలలో చేపట్టిన ప్రాజెక్టుల ద్వారా కొంతవరకైనా ప్రయోజనాలు చేకూరాలంటే పోతిరెడ్డి పాడు హెడ్ రెగ్యులేటర్ నిర్మాణం, ప్రధాన కాలువ పూర్తిస్థాయి అభివృద్ధి ఈ సీజనులోనే జరగాలి. అలాగే, ఎస్ఆర్‌బీసీ, గాలేరు, నగరి, హంద్రి నీవాలలో సత్వర లబ్ధి చేకూరుటకు నడుం కట్టాలి. పట్టిసీమ వద్ద పంపులు ఏర్పాటుకు అక్కడి రైతులు వ్యతిరేకిస్తున్నారు. కుడికాలువ పనులు పూర్తికాకుండా పంపులు ఏర్పాటుకు నిర్ణయించుట అపార్థాలకు దారితీస్తుంది. ప్రభుత్వం రాయలసీమకు గుక్కెడు తాగునీరు ఇచ్చుటకు గోదావరి నీటిని కృష్ణానదిలోకి మళ్ళించి ఆ పొదుపైన నీటిని శ్రీశైలం ద్వారా అందిస్తామని చెప్తున్నారు. 70శాతం ప్రయోజనం చేకూరాలంటే గుర్తించబడిన పదిశాతం పనులు పూర్తి చేసి సత్వర ప్రయోజనం చేకూరే విధంగా ముందుకు వెళదాం.

ముందుగా కృష్ణాడెల్టా ఆధునికీకరణలో గతంలో చేసిన తప్పులు సరి చేయాలి. గత ఎనిమిదేళ్ళకాలంలో కుప్పకూలిన డెల్టాలో ఆదా చేసిన 20,30 టీఎంసీల నీటిని తక్షణమే పై అవసరాలకు వాడుకోవచ్చు. అలాగే, నాగార్జున సాగర్ ఆయకట్టులో అధికనీటి వినియోగం జరుగుతోంది. దీనిని అరికట్టి రెండు ప్రాంతాల్లోనూ కనీసం 40-50 టీఎంసీల నీరు ఆదా చేయాలి. కొత్తగా ప్రాజెక్టులకు వెంటనే నిర్మించలేము. అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టుల ద్వారా సత్వర ప్రయోజనాలు చేకూరే విధంగా పనులు చేపట్టాలి. అందువలన పోలవరం ప్రాజెక్టు కల సాకారమయ్యే సమయంలో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు చేపట్టుట గురించి ప్రభుత్వం పునరాలోచించింది ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయుటకు కృషి చేయాలని గట్టిగా విజ్ఞప్తి చేస్తున్నాము.


ప్రభుత్వానికి మా సూచనలు: తాటిపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుని కుడికాలువలోకి కొంత మేరకు నీటిని మళ్లించాలి; చింతలపూడి ఎత్తిపోతల పథకం మొదటి స్టేజిని వెంటనే పూర్తి చేసి పోలవరం కుడికాలువలోకి కలపాలి; పోలవరం కూడి కాలువ పనులు 2017 జూలై నాటికి పూర్తి చేయాలి. జాతీయ జల రవాణా క్రింద గోదావరి, ఏలూరు కాలువను అభివృద్ధి పరచి, లైనింగ్ చేసి 1500 నుంచి 2000 క్యూసెక్కులు నీటిని అదనంగా వచ్చే విధంగా ఏలూరు వద్దకు చేర్చి అక్కడి నుంచి కృష్ణ ఏలూరు కాలువను ఆ మేరకు అభివృద్ధి చేయాలి. కృష్ణ ఏలూరు కాలువ ఆయకట్టుతో పాటు రైవస్ కాలువకూడా మళ్లించి ఆయకట్టుకు కూడా కొంత వరకు నీరును ఇవ్వవచ్చు. దీని ద్వారా సుమారు 15-20 టీఎంసీల నీటిని తరలించవచ్చు.

పోలవరం కుడి కాలువ నుంచి రామిలేరు ద్వారా కృష్ణ ఏలూరు కాలువలోనికి అక్కడ నుంచి రైవస్ కాలువకు కూడా మూడు వేల క్యూసెక్కుల మేరకు నీటిని తరలించవచ్చు; ముందుగా కృష్ణా డెల్టా ఆధునికీకరణ పూర్తి చేసి వంతుల వారీగా నీరు విడుదల చేసి డెల్టాలో 80-90 టీఎంసీల నీటిని మాత్రమే వాడుకునే విధంగా కాలువల వ్యవస్థను రూపొందించాలి. దీనిద్వారా 20-30 టీఎంసీలు ఆదా చేయవచ్చు. పులిచింతల పునరావాస కార్యక్రమం సత్వరమే పూర్తి చేసి 45 టీఎంసీలు నిల్వ చేయాలి; ప్రకాశం బ్యారేజ్ పైన మునేరు దిగువున వేరొక రోడ్ కమ్ బ్యారేజ్ నిర్మాణం చేసి వచ్చే వరద నీరు పది టీఎంసీలను వినియో గించుకోవాలి. పై పథకాల ద్వారా తాటిపూడి, చింతలపూడి, గోదావరి ఏలూరు కాలవ ద్వారా పులిచింతల వగైరాలు ప్రకాశం బ్యారేజ్ ఎగువన లభించే పది టీఎంసీలను వినియోగించుకొనుట ద్వారా నాగార్జున సాగర్ నుంచి డెల్టాకు నీటి విడుదల లేకుండానే డెల్టా సాగు చేయవచ్చు.

– యెర్నేని నాగేంద్రనాథ్

# చదువులు చట్టుబండలు

## రెండో తరగతి పుస్తకాన్ని చదవలేని 8వ తరగతి విద్యార్థులు
## వెల్లడించిన 'ప్రథమ్' నివేదిక



గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులకు పెద్దగా నేర్పుతున్నదేమీ లేదని ఒక అధ్యయనం వెల్లడించింది. పిల్లలు చిన్న చిన్న లెక్కలు కూడా చేయలేకపోతున్నారని, ఆంగ్లంలో ఒక వాక్యాన్ని కూడా తప్పులు లేకుండా చదవలేకపోతున్నారని ఈ సర్వే తెలిపింది. విధానకర్తలు, విద్యావేత్తలు ఎంతగానో ప్రాధాన్యతనిచ్చే "ప్రథమ్" నివేదిక ఈ వాస్తవాలను వెల్లడించింది. "విద్యారంగ వార్షిక స్థాయినివేదిక–2014"ను ప్రథమ్ సంస్థ దిల్లీలో విడుదల చేసింది. దేశంలో ఉన్న విద్యారంగ పరిస్థితిని తెలుసుకోవటానికి 8,844 ప్రాథమిక, 6,362 ప్రాథమికోన్నత పాఠశాలలకు వెళ్లి ఈ నివేదికను రూపొందించారు. దీంట్లో ఉన్న వివరాలు..

**చదవటం:** మూడో తరగతి విద్యార్థుల్లో కేవలం25 శాతం మంది మాత్రమే రెండో తరగతి పుస్తకాన్ని తడబాటు, తప్పులు లేకుండా చదవగలుగుతున్నారు. ఐదో తరగతి విద్యార్థుల్లో 50 శాతం మంది, 8వ తరగతి విద్యార్థుల్లో 75 శాతం మంది రెండో తరగతి పుస్తకాన్ని తప్పులు లేకుండా చదవగలుగుతున్నారు.

అంటే, 8వ తరగతికి వచ్చినప్పటికీ 25 శాతం మంది విద్యార్థులు కనీసం రెండవ తరగతి పుస్తకాన్ని చదవలేకపోతున్నారు.

**గణితం:** తొమ్మిది వరకూ అంకెలను గుర్తించని రెండో తరగతి విద్యార్థులు 2009లో 11.3 శాతం మంది ఉండగా.. 2014లో వారి సంఖ్య 19.5 శాతానికి పెరిగింది.

- భాగహారం చేసే సామర్థ్యం ఎనిమిదో తరగతి విద్యార్థుల్లో 2010 నుంచీ క్రమేణా తగ్గుతోంది. ఓ మూడంకెల సంఖ్యను ఒక అంకెతో తప్పులు లేకుండా భాగించే 8వ తరగతి విద్యార్థులు 2010 లో 68.3 శాతం మంది ఉండగా.. 2014లో వారి సంఖ్య 44.1 శాతానికి పడిపోయింది.
- ఆంగ్లంలో ఉన్న సరళమైన వాక్యాన్ని తప్పులు లేకుండా చదివే 5వ తరగతి విద్యార్థుల సంఖ్య 2009 నుంచి 2014 వరకూ 25 శాతంగానే నమోదవుతోంది. అయితే, ప్రాథమికోన్నత తరగతుల్లో పరిస్థితి ఈ విధంగా లేదు. ఇంగ్లిష్‌లో ఉన్న సరళ వాక్యాలను తప్పులు లేకుండా చదివే 8వ తరగతి విద్యార్థులు 2009లో 60 శాతం మంది ఉండగా.. ప్రస్తుతం వారి సంఖ్య 46.8 శాతానికి పడిపోయింది.
- ఇంగ్లిష్ వాక్యాన్ని చదవగలిగే వారిలో ఆ వాక్యం అర్థాన్ని సరిగా చెప్పే వారి సంఖ్య దాదాపు 60 శాతం వరకూ ఉంటోంది.

**చేరికల్లో మెరుగు**

- పాఠశాలలో చేరుతున్న విద్యార్థుల సంఖ్య క్రమేణా పెరుగుతోంది. ప్రస్తుతం 6-14 ఏళ్ల వయసున్న పిల్లల్లో 96 శాతం మంది పాఠశాలల్లో చదువుకుంటున్నట్లు వెల్లడైంది. 96 లేదా అంతకన్నా ఎక్కువ శాతం నమోదు కావటం ఇది వరుసగా ఆరోసారి. అంటే ఈ వయసు పిల్లల్లో స్కూలుకు వెళ్లని వారు కేవలం 3.3 శాతం మంది మాత్రమే ఉన్నారు. దేశంలోని 6-14 ఏళ్ల వయసు పిల్లలందరూ పాఠశాలల్లో ఉండటమనే లక్ష్యం సాధ్యం కావటానికి మరెంతో కాలం పట్టకపోవచ్చు.
- విద్యాహక్కుచట్టం వర్తించని 15-16 ఏళ్ల వయసు బాలల్లో పాఠశాలకు వెళ్లని వారి సంఖ్య అధికంగానే ఉంటోంది. గ్రామీణప్రాంతాల్లో 15.9 శాతం మంది బాలురు, 17.3 శాతం మంది బాలికలు పాఠశాలలకు వెళ్లటం లేదు.
- హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్, గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో విద్యార్థుల హాజరుశాతం 80 నుంచి 90 వరకు ఉంటోంది. యూపీ, బీహార్, పశ్చిమ్‌బంగ, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్‌లలో హాజరుశాతం 50 నుంచి 60 వరకే పరిమితమవుతోంది.

**విద్యార్థులు/ఉపాధ్యాయులు**

- విద్యార్థులు/ఉపాధ్యాయుల నిష్పత్తి విద్యాహక్కుచట్టం నిర్దేశించిన మేరకు ఉన్న పాఠశాలలు 2010లో 38.9 శాతం ఉండగా, 2014లో వీటిసంఖ్య 45.3 శాతానికి పెరిగింది.

**ప్రైవేటు హవా**

- గ్రామీణప్రాంతాల్లోనూ ప్రైవేటు పాఠశాలల ప్రభావం పెరుగుతోంది. 2014లో పాఠశాలకు వెళ్లే 6 నుంచి 14 ఏళ్ల వయసున్న పిల్లల్లో 30.8 శాతం మంది ప్రైవేటు స్కూళ్లలో చదువుతున్నారు. 2013లో ఇది 29 శాతం. ప్రైవేటుపాఠశాలలకు వెళ్తున్న వారిలో బాలికల కన్నా బాలురు ఎక్కువగా ఉంటున్నారు.

**భారీ సర్వే:** 'విద్యారంగ వార్షిక స్థాయినివేదిక-2014 కోసం భారీస్థాయిలో సర్వే జరిపారు. స్థానిక సంస్థలు, వ్యక్తుల సాయంతో దీనిని నిర్వహించారు. దీంట్లోభాగంగా 577 జిల్లాలకు, 16,497 గ్రామాలకు వెళ్లి వాస్తవ పరిస్థితులను పరిశీలించారు. 3,40,000 కుటుంబాలను కలుసుకున్నారు. 3-16 ఏళ్ల వయసున్న 5,70,000 మంది విద్యార్థుల్ని ప్రశ్నించి వివరాల్ని రాబట్టారు.

## Performance of states

**Table 14: Private school enrollment and learning levels 2014**

| State | Private school | Std V: Learning levels | | | | Std VII: Learning levels | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | % Children (Age 6-14) in private schools | % Children who CAN READ a Std II level text | % Children who CAN DO at least SUBTRACTION | % Children who CAN READ ENGLISH SENTENCES | Of those who can read English sentences, % children who CAN TELL MEANINGS of the sentences | % Children who CAN DO DIVISION | % Children who CAN READ ENGLISH SENTENCES | Of those who can read English sentences, % children who CAN TELL MEANINGS of the sentences |
| AP + Telangana | 36.7 | 56.3 | 71.5 | 45.2 | 67.6 | 48.4 | 63.9 | 75.8 |
| Arunachal Pradesh | 24.5 | 44.4 | 74.8 | 52.3 | 76.7 | 39.1 | 67.9 | 74.6 |
| Assam | 17.3 | 33.5 | 38.9 | 17.8 | 53.4 | 20.6 | 34.7 | 61.8 |
| Bihar | 12.0 | 48.1 | 53.2 | 18.7 | 54.5 | 52.7 | 33.9 | 53.2 |
| Chhattisgarh | 17.8 | 52.4 | 39.3 | 10.7 | 58.6 | 22.6 | 21.5 | 60.1 |
| Gujarat | 13.3 | 46.6 | 41.7 | 9.8 | 54.8 | 27.9 | 26.7 | 69.8 |
| Haryana | 54.2 | 68.1 | 74.8 | 50.4 | 67.5 | 60.6 | 63.1 | 74.6 |
| Himachal Pradesh | 35.2 | 75.2 | 76.1 | 53.4 | 55.9 | 55.5 | 68.6 | 70.4 |
| Jammu and Kashmir | 48.1 | 38.7 | 62.9 | 52.2 | 61.6 | 32.3 | 71.0 | 65.6 |
| Jharkhand | 18.0 | 34.4 | 44.0 | 14.6 | 60.1 | 39.1 | 30.9 | 54.8 |
| Karnataka | 25.5 | 47.2 | 53.7 | 21.2 | 78.7 | 29.0 | 39.3 | 73.5 |
| Kerala | 62.2 | 66.8 | 71.3 | 68.5 | 81.1 | 52.7 | 80.0 | 87.1 |
| Madhya Pradesh | 21.4 | 34.1 | 31.0 | 9.6 | 54.5 | 24.1 | 18.3 | 43.9 |
| Maharashtra | 36.9 | 53.5 | 41.0 | 21.5 | 54.8 | 28.3 | 38.9 | 63.3 |
| Manipur | 73.3 | 66.6 | 85.3 | 79.4 | 74.1 | 67.0 | 92.8 | 80.1 |
| Meghalaya | 51.7 | 58.3 | 60.9 | 59.6 | 64.7 | 29.2 | 78.5 | 78.2 |
| Mizoram | 40.0 | 52.1 | 87.4 | 52.5 | 59.9 | 77.7 | 79.9 | 76.1 |
| Nagaland | 38.9 | 41.6 | 80.4 | 62.6 | 74.6 | 50.6 | 85.7 | 86.8 |
| Odisha | 8.5 | 51.9 | 47.3 | 22.9 | 55.3 | 36.2 | 39.7 | 61.7 |
| Punjab | 49.5 | 66.5 | 69.1 | 50.8 | 65.9 | 54.5 | 66.7 | 77.4 |
| Rajasthan | 42.1 | 46.7 | 45.9 | 15.2 | 50.7 | 42.3 | 32.6 | 56.1 |
| Sikkim | 31.3 | 43.4 | 78.2 | 64.4 | 81.8 | 55.2 | 87.3 | 92.9 |
| Tamil Nadu | 31.9 | 46.9 | 63.2 | 33.1 | 72.3 | 38.0 | 48.7 | 77.5 |
| Tripura | 9.1 | 45.5 | 58.2 | 26.6 | 77.7 | 38.4 | 58.7 | 67.0 |
| Uttarakhand | 37.5 | 60.6 | 54.4 | 32.0 | 69.3 | 40.3 | 44.1 | 71.7 |
| Uttar Pradesh | 51.7 | 44.7 | 46.7 | 21.1 | 53.5 | 37.0 | 34.1 | 59.7 |
| West Bengal | 8.8 | 53.2 | 56.1 | 24.2 | 68.6 | 33.6 | 32.2 | 71.9 |
| **All India** | **30.8** | **48.1** | **50.5** | **24.0** | **62.2** | **37.8** | **38.8** | **66.3** |

| Table 24: Performance of schools with respect to selected Right to Education indicators 2010-2014 | | | | | | | | | | | | | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| State | School facilities | | | | | | | | | | | | | | | | | | | | | | | | |
| | % Schools that have: | | | | | | | | | | | | | | | | | | | | | | | | |
| | Boundary wall | | | | | Kitchen shed for cooking mid-day meal | | | | | Drinking water provision and available | | | | | Toilet available and useable | | | | | Girls toilets available and useable | | | | |
| | 2010 | 2011 | 2012 | 2013 | 2014 | 2010 | 2011 | 2012 | 2013 | 2014 | 2010 | 2011 | 2012 | 2013 | 2014 | 2010 | 2011 | 2012 | 2013 | 2014 | 2010 | 2011 | 2012 | 2013 | 2014 |
| AP + Telangana | 52.9 | 49.3 | 49.9 | 48.8 | 50.3 | 67.0 | 62.8 | 62.8 | 66.6 | 69.6 | 64.8 | 60.8 | 66.3 | 65.1 | 61.2 | 38.6 | 33.4 | 47.7 | 55.1 | 64.3 | 25.4 | 28.1 | 38.2 | 43.0 | 54.2 |
| Arunachal Pradesh | 24.5 | 34.9 | 40.7 | | 44.9 | 64.0 | 63.1 | 51.5 | | 57.4 | 53.2 | 58.1 | 48.9 | | 53.5 | 25.3 | 27.2 | 35.1 | | 35.1 | 12.2 | 19.2 | 23.2 | | 24.5 |
| Assam | 19.1 | 23.3 | 27.8 | 23.0 | 24.3 | 80.2 | 81.7 | 84.1 | 84.0 | 82.7 | 60.9 | 64.6 | 65.4 | 65.6 | 65.3 | 33.1 | 37.8 | 52.8 | 60.9 | 58.7 | 13.7 | 27.4 | 40.4 | 43.0 | 47.0 |
| Bihar | 48.1 | 47.5 | 47.9 | 52.5 | 52.4 | 64.0 | 71.6 | 74.1 | 82.7 | 87.7 | 78.7 | 83.8 | 85.4 | 85.9 | 90.4 | 33.6 | 45.7 | 51.2 | 58.7 | 60.6 | 18.1 | 35.4 | 42.0 | 47.6 | 46.2 |
| Chhattisgarh | 48.8 | 48.7 | 50.5 | 52.8 | 60.8 | 86.1 | 86.8 | 89.0 | 89.5 | 92.9 | 77.6 | 73.3 | 79.2 | 75.5 | 80.3 | 29.6 | 26.8 | 51.4 | 60.3 | 68.9 | 20.0 | 20.7 | 41.6 | 46.7 | 53.4 |
| Gujarat | 84.4 | 91.0 | 87.4 | 90.4 | 90.9 | 88.3 | 92.2 | 88.7 | 88.9 | 90.0 | 79.4 | 83.9 | 82.3 | 85.7 | 87.0 | 64.8 | 69.5 | 70.0 | 83.6 | 84.8 | 49.9 | 67.7 | 65.8 | 79.6 | 81.4 |
| Haryana | 82.7 | 83.9 | 88.9 | 92.5 | 91.4 | 51.0 | 60.5 | 68.3 | 75.9 | 75.8 | 74.6 | 78.3 | 75.7 | 73.5 | 76.2 | 67.9 | 70.1 | 73.5 | 80.2 | 81.8 | 52.8 | 68.0 | 70.8 | 77.6 | 79.6 |
| Himachal Pradesh | 37.9 | 42.1 | 49.4 | 55.4 | 66.4 | 82.5 | 89.5 | 94.5 | 94.3 | 97.1 | 83.2 | 81.8 | 83.4 | 85.9 | 87.7 | 56.0 | 68.5 | 74.2 | 79.1 | 87.6 | 38.7 | 64.9 | 70.4 | 77.3 | 86.2 |
| Jammu and Kashmir | | 28.8 | 26.7 | 33.1 | 28.7 | | 70.6 | 73.8 | 80.3 | 75.5 | | 46.6 | 50.5 | 52.5 | 51.6 | | 36.3 | 49.0 | 60.6 | 58.1 | | 22.4 | 30.6 | 38.8 | 46.7 |
| Jharkhand | 27.0 | 25.0 | 21.6 | 26.6 | 24.7 | 73.5 | 76.2 | 77.0 | 78.3 | 83.9 | 73.8 | 80.6 | 78.1 | 78.1 | 80.2 | 26.8 | 37.5 | 37.0 | 40.5 | 52.9 | 20.9 | 36.6 | 32.0 | 36.4 | 48.0 |
| Karnataka | 59.3 | 69.0 | 70.2 | 73.1 | 73.7 | 92.9 | 94.0 | 94.1 | 94.5 | 93.0 | 75.8 | 81.9 | 81.3 | 80.1 | 81.2 | 38.4 | 44.2 | 59.5 | 66.0 | 60.2 | 31.8 | 41.1 | 54.0 | 59.6 | 55.1 |
| Kerala | 81.8 | 86.1 | 72.9 | 67.4 | 77.7 | 98.1 | 97.8 | 95.6 | 97.5 | 98.8 | 85.7 | 93.8 | 85.1 | 81.8 | 83.0 | 58.2 | 71.6 | 75.7 | 86.6 | 84.8 | 43.9 | 68.6 | 73.5 | 83.5 | 80.2 |
| Madhya Pradesh | 37.3 | 36.9 | 37.8 | 39.1 | 40.3 | 89.9 | 86.9 | 88.0 | 88.5 | 89.9 | 78.5 | 68.6 | 70.5 | 70.6 | 75.1 | 50.3 | 31.9 | 46.7 | 57.0 | 55.4 | 28.9 | 23.4 | 34.4 | 39.4 | 40.5 |
| Maharashtra | 57.5 | 58.1 | 52.9 | 62.8 | 66.9 | 78.2 | 74.8 | 70.9 | 85.9 | 92.0 | 69.0 | 73.1 | 69.5 | 72.2 | 70.5 | 53.0 | 44.9 | 57.3 | 66.0 | 66.3 | 43.2 | 42.6 | 53.1 | 62.1 | 59.1 |
| Manipur | 11.3 | 6.6 | 6.7 | 6.6 | 9.6 | 58.4 | 42.9 | 53.4 | 58.1 | 52.8 | 5.1 | 6.4 | 7.1 | 13.0 | 15.7 | 40.2 | 35.2 | 40.9 | 47.9 | 53.1 | 8.4 | 15.3 | 23.0 | 21.6 | 19.8 |
| Meghalaya | 14.2 | 14.1 | 12.7 | 5.3 | 9.7 | 60.6 | 70.5 | 69.1 | 77.0 | 83.3 | 23.9 | 9.9 | 12.8 | 23.2 | 16.5 | 24.5 | 24.4 | 31.7 | 47.8 | 38.8 | 14.8 | 18.6 | 20.5 | 30.4 | 16.8 |
| Mizoram | 37.7 | 47.8 | 45.2 | 35.2 | 51.1 | 96.2 | 98.6 | 95.0 | 91.9 | 94.0 | 48.5 | 71.0 | 65.0 | 71.8 | 68.5 | 55.6 | 52.1 | 44.2 | 51.7 | 33.7 | 30.8 | 33.1 | 30.0 | 39.0 | 28.1 |
| Nagaland | 42.8 | 34.5 | 52.9 | 37.0 | 52.6 | 81.7 | 91.8 | 85.3 | 87.0 | 79.2 | 37.0 | 23.4 | 22.2 | 24.2 | 23.4 | 53.9 | 60.0 | 52.5 | 63.2 | 68.0 | 30.6 | 49.7 | 32.7 | 36.4 | 45.0 |
| Odisha | 40.8 | 46.1 | 44.9 | 40.1 | 48.1 | 74.4 | 78.4 | 80.2 | 78.5 | 82.6 | 70.3 | 74.5 | 78.7 | 79.6 | 81.6 | 44.4 | 51.8 | 49.3 | 54.2 | 63.1 | 34.7 | 46.8 | 41.4 | 44.4 | 53.0 |
| Punjab | 82.8 | 83.9 | 83.0 | 89.2 | 88.9 | 94.7 | 93.9 | 97.7 | 96.8 | 94.5 | 83.1 | 82.9 | 82.8 | 81.5 | 81.0 | 61.2 | 58.7 | 70.5 | 80.5 | 79.2 | 49.4 | 56.2 | 65.6 | 74.0 | 71.6 |
| Rajasthan | 70.1 | 72.7 | 77.3 | 83.1 | 84.5 | 83.8 | 84.7 | 85.6 | 85.3 | 89.8 | 68.0 | 69.5 | 67.1 | 67.1 | 73.4 | 65.4 | 69.9 | 72.0 | 72.9 | 81.5 | 50.3 | 66.3 | 65.1 | 65.2 | 73.7 |
| Sikkim | 14.5 | 25.7 | 27.9 | 31.6 | 42.7 | 95.7 | 94.4 | 93.0 | 98.0 | 97.3 | 76.8 | 67.6 | 69.8 | 70.5 | 74.0 | 59.4 | 31.6 | 60.0 | 66.0 | 73.0 | 37.5 | 27.8 | 53.7 | 62.4 | 65.2 |
| Tamil Nadu | 60.7 | 58.9 | 66.7 | 64.3 | 71.0 | 96.7 | 96.7 | 98.6 | 99.6 | 97.5 | 80.5 | 77.6 | 81.0 | 79.3 | 79.8 | 44.6 | 48.4 | 68.1 | 77.6 | 79.8 | 35.1 | 42.7 | 61.4 | 67.0 | 68.7 |
| Tripura | 19.4 | 25.3 | 20.0 | 24.1 | 28.2 | 88.2 | 90.4 | 95.0 | 99.1 | 97.1 | 40.0 | 40.2 | 48.5 | 54.2 | 56.2 | 43.0 | 30.8 | 50.0 | 50.9 | 58.7 | 30.3 | 21.9 | 33.0 | 42.7 | 57.1 |
| Uttarakhand | 66.8 | 61.1 | 56.9 | 64.9 | 56.6 | 96.3 | 94.1 | 94.1 | 90.4 | 97.3 | 68.3 | 68.2 | 71.0 | 72.7 | 69.2 | 53.4 | 59.7 | 64.4 | 69.1 | 69.2 | 24.0 | 53.3 | 52.9 | 60.9 | 53.7 |
| Uttar Pradesh | 44.4 | 57.9 | 58.5 | 62.9 | 64.3 | 89.3 | 94.7 | 94.2 | 95.6 | 96.0 | 82.2 | 84.4 | 81.3 | 80.9 | 85.8 | 47.4 | 53.9 | 52.5 | 49.1 | 54.9 | 33.9 | 47.4 | 43.7 | 44.3 | 49.1 |
| West Bengal | 34.5 | 42.2 | 44.0 | 46.1 | 48.7 | 86.3 | 86.8 | 90.2 | 91.4 | 95.4 | 67.2 | 63.4 | 71.9 | 72.9 | 78.4 | 52.1 | 49.5 | 58.8 | 68.0 | 70.8 | 23.7 | 41.2 | 44.0 | 53.7 | 46.9 |
| **All India** | **51.0** | **53.9** | **54.7** | **56.3** | **58.8** | **82.1** | **83.7** | **84.3** | **87.0** | **88.1** | **72.7** | **73.5** | **73.0** | **73.8** | **75.6** | **47.2** | **49.0** | **56.4** | **62.6** | **65.2** | **32.9** | **43.7** | **48.1** | **53.3** | **55.7** |

# అమ్మాయిలు సర్కారీ బడులకు..
# అబ్బాయిలు ప్రైవేటుకు

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల మనుగడ ప్రమాదంలో పడుతోందని, %“%ప్రైవేటు%“% నుంచి పోటీ రోజురోజుకూ తీవ్రమవుతోందని ప్రథమ్ విడుదల చేసిన విద్యావార్షిక నివేదిక (అసర్)-2014 తేల్చి చెప్పింది. 2004 నుంచి అన్ని రాష్ట్రాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సర్వే చేసి విడుదల చేస్తున్న విద్యావార్షిక నివేదికలో తొలిసారిగా తెలంగాణనూ విడిగా చేర్చారు. మంగళవారం దిల్లీలో విడుదలైన ఈ సర్వేలోని వివరాలను చూస్తే తెలంగాణలోని పాఠశాలల్లో (ప్రభుత్వ, ప్రైవేటు) విద్యార్థుల నమోదు భారీగానే (సుమారు 97.4శాతం) ఉన్నా నాణ్యత మాత్రం నాసిరకంగానే ఉంటోందని తేలింది.

కేవలం 2.6 శాతం మంది మాత్రమే బడిబయట ఉంటున్నారు. గణాంకాల్ని చూస్తే ఇప్పటికీ ప్రభుత్వ పాఠశాలల్లోనే అత్యధికంగా పిల్లలు చేరుతున్నారు. అయితే పదేళ్ల కిందట 20 శాతమున్న ప్రైవేటు పాఠశాలల నమోదు ఇప్పుడు 40 శాతానికి చేరడం ప్రభుత్వ పాఠశాలల మనుగడకు ముప్పేనని నిపుణుల అంచనా. ప్రాథమిక స్థాయిలో మూడుశాతం లోపు ఉన్న బడిబయట పిల్లలు ఉన్నత పాఠశాలకు వచ్చేసరికి 15 శాతానికి చేరడం గమనార్హం. నాణ్యతలో మాత్రం ప్రాథమికంతో పోల్చితే ఉన్నత పాఠశాలల్లో కాస్త మెరుగ్గా ఉంది. ఇక తెలంగాణ ప్రభుత్వం యోచిస్తున్న శిశుతరగతుల ఆరంభానికి ఈ సర్వేలో ఊతం లభించింది. మూడేళ్లలోపు పిల్లలు 60శాతం దాకా అంగన్‌వాడీల్లో ఉండగా మధ్యలో స్కూలు లేకపోవడంతో ఐదేళ్లకు వచ్చేసరికి ఆ ప్రవాహంలో అత్యధికులు ప్రైవేటుబాట పడుతున్నట్లు సర్వే తేల్చింది. నాలుగో ఏడు నిండిన పిల్లల్ని ఎక్కడ చేర్చాలనే సందేహంతో చాలా మంది అంగన్‌వాడీలను వీడి ప్రైవేటు పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీల్లో చేర్చుతున్నారు.

దీంతో ప్రైవేటులో ఈ దశలో దాదాపు 30శాతం పెరుగుదల నమోదవుతోంది. ఆరో ఏటికల్లా ఈ పిల్లల్లోంచి 45.9 శాతం ప్రభుత్వంలో.. 49.7 శాతం ప్రైవేటులో ఉంటున్నారు. %“‘‘%2004లో ఈ సర్వే మొదలైనప్పుడు ప్రైవేటు స్కూళ్లలో నమోదు 20% లోపే ఉండేది. పదేళ్లలో ఇది సుమారు రెట్టింపైంది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలు మూతపడే ప్రమాదం కనిపిస్తోంది. 9, 10 తరగతుల్లో బడి మానేసే వారి సంఖ్య పెరుగుతోంది. 4, 5 ఏళ్ల పిల్లలకు శిశు సంరక్షణ కేంద్రాలు ప్రారంభించడం తప్పనిసరని సర్వే చాటిచెబుతోంది. కేజీల్లోనే ప్రైవేటుకు అలవాటు పడుతున్న పిల్లలు మళ్లీ ప్రభుత్వం వైపు రావడం లేదు.



# 'పౌరసేవలు' హక్కు కావాలి

ప్రజల యొక్క, ప్రజల కొరకు, ప్రజల చేత అంటూ ప్రజాస్వామ్యం గురించి తరతరాలకూ చెరగని నిర్వచనాన్నిచ్చిన అబ్రహాం లింకన్ అధ్యక్షకాలంలో కూడా అమెరికాలో కొందరికే ఓటు హక్కు ఉంటే, మనదేశం స్వతంత్రం వచ్చిన తొలినాళ్ల నుంచీ దేశంలో అందరికీ వయోజన ఓటు హక్కునిచ్చి అత్యంత సాహసోపేత రాజకీయ సంస్కరణను అమలుచేసింది. ఇంత గొప్ప తొలిఅడుగును మనదేశం వేసినా, 'ప్రజలే ప్రభువులు .. పాలకులు, ప్రభుత్వోద్యోగులు సేవకులే' అనే భూస్వామ్య సంస్కృతి. మెజారిటీ భారతీయుల్ని ద్వితీయశ్రేణి పౌరులుగా భావించే ఈ రెండు ధోరణులనూ భారత రాజ్యాంగం నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్నప్పటికీ, ప్రజలలో పౌరసత్వ భావన వేళ్లూనుకునే అధికార వికేంద్రీకరణ, అందరికీ నాణ్యమైన విద్య, వైద్యం, గ్రామాలు-పట్టణాల మధ్య అంతరాన్ని తగ్గించేందుకు వ్యవసాయంలో స్వేచ్ఛా మార్కెట్ వంటి మౌలిక సంస్కరణలు తొలితరంలో రాకపోవటం వల్ల పౌరులు పాలకుల్ని, ప్రభుత్వోద్యోగుల్ని ఆధునిక చక్రవర్తుల్లాగా భావించే



ప్రజాస్వామ్య సంస్కృతి ఇంకా మనదేశంలో వేళ్లూనుకోలేదు. ప్రజలు, ప్రభుత్వం పాత్ర తారుమారైపోయి పౌరులు యాచించేవారుగా, పాలకులు, ప్రభుత్వోద్యోగులు దయదలిచి దానాలు, వరాలు ప్రకటించే యజమానులుగా కొనసాగుతున్నారు. చుట్టుపక్కల దేశాలతో పోలిస్తే ఏదోక రకంగా ఎన్నికలు జరిగి శాంతియుతంగా అధికార మార్పిడి జరుగుతోంది కాబట్టి మనది ప్రజాస్వామ్య దేశం అనే మేరకే సంతృప్తిపడాల్సి వస్తోంది. మన పాలనావ్యవస్థ ఇంకా బ్రిటీషు దొరల ప్రభావం నుంచి బైటపడలేదు. దానికితోడు స్వదేశంలో పాతుకుపోయి ఉన్న మధ్యయుగాలనాటి పరిస్థితి ఏర్పడింది.

అన్నీ ప్రభుత్వమే చేస్తుంది అనే సోషలిస్టు భావజాలం ఈ పరిస్థితిని సర్వత్రా మరింత పాతుకుపోయేలా చేసింది. నిజానికి కోట్లాది సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఢిల్లీలోనో, రాష్ట్ర రాజధానుల్లోనో పెద్ద పని ఉండదు. వారి రోజువారీ జీవితం ఎక్కువగా స్థానిక ప్రభుత్వాల చుట్టూనే తిరుగుతుంటుంది. 80శాతం పనులు స్థానికంగానే పూర్తి కావచ్చు. కానీ అధికారాన్ని కేంద్రీకరించి స్థానిక ప్రభుత్వాలకు నిధులు, విధులు లేకుండా ఏజన్సీలుగా మార్చేయటం, ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం, వేధింపులు, ఛీత్కారాలు, సిఫార్సులు లేకుండా పనిచేసే

పరిస్థితి లేకపోవటం వల్ల ఎన్నికలలో ఓటుకు నోటు, మద్యం, తాత్కాలిక తాయిలాల పథకాలు, ఇతర ప్రలోభాలు వంటివి ఆశిస్తూ ఓటు వేసే వారి సంఖ్య పెరిగిపోయింది. ఈ రకంగా ఓట్ల వేటలో అసలు తాము చేయాల్సిన మౌలికమైన బాధ్యతల్ని – చట్టబద్ధ పాలన, శాంతిభద్రతల పరిరక్షణ, మౌలిక వసతుల ఏర్పాటు, విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి వాటిని ప్రభుత్వాలు గాలికి వదిలేశాయి. ప్రభుత్వ ప్రజలకు సేవలందించే వ్యవస్థను మెరుగుపరిచే సంస్కరణల్ని, చట్టాల్ని తీసుకురాకపోవటం వల్ల రాజకీయ నాయకులు కూడా మూల్యం చెల్లించాల్సి వస్తోంది.

సేవకులుగా ప్రభుత్వోద్యోగులు ప్రజలకు చేసిపెట్టాల్సిన పనుల్ని ఏదోకరకంగా రాజకీయ నాయకులే చేసి పెడుతూ ఓట్లు దండుకోవటం ఎన్నికల రాజకీయంగా మారింది. ప్రజలకు చేయాల్సిన చట్టబద్ధమైన, రాజ్యాంగబద్ధమైన పనులు పక్కనపడేసి ప్రజలకు రోజువారీ అందుబాటులో ఉండి వారికి అవసరమైన పనులు చేసి పెట్టి ప్రచారం తెచ్చుకుంటే, ఎన్నికల సమయంలో డబ్బు, మద్యం, తాయిలాలు పంచితే, భవిష్యత్తుకు తీవ్ర నష్టం చేసేవైనా సరే కొన్ని తాత్కాలిక పథకాలను హామీగా పడేస్తే గెలుపునకు అవకాశాలుంటాయనేది ఫార్ములాగా మారింది. ఇవీ చాలకపోతే ప్రజల మధ్య ఆటవిక భావోద్వేగాలను రెచ్చగొట్టి విభేదాల్ని సృష్టించటానికి కూడా వెనకాడటం లేదు. ఈ క్రమంలో నియోజకవర్గానికి రెండొందల మంది దాకా రాజకీయ బ్యూరోక్రాట్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇలా రాజకీయ బ్యూరోక్రాట్లని పోషించటానికి ఒక ఎమ్మెల్యే తక్కువలో తక్కువగా నెలకి పదిలక్షల దాకా ఖర్చు చేయాల్సి ఉంటుందని అనుభవజ్ఞులైన సాంప్రదాయ రాజకీయ పార్టీల నేతలు బహిరంగంగానే చెప్పే మాట. ఇంత డబ్బును, సమయాన్ని వెచ్చిస్తున్నందుకు ఎన్నికయ్యాక అనేకరెట్లు దండుకోవటం రాజకీయ నేతలకు ఆనవాయితీగా మారింది. ఈ క్రమంలో ప్రభుత్వ కార్యాలయాలను ప్రక్షాళన చేసే సాహసాన్ని నేతలెవరూ చేయటం లేదు. పైపెచ్చు ఎన్నికైనవారిలో చాలామంది నేతలు ప్రభుత్వోద్యోగుల విషయంలో తమకు అందుబాటులో ఉండే బదిలీలు, ఇతరత్రా అధికారాల్ని అక్రమ సంపాదనకు మార్గంగా వినియోగించుకుంటున్నారు. అంతేతప్ప, ప్రభుత్వోద్యోగిని సేవాభావానికి మారుపేరుగా మార్చే దిశగా నిర్మాణాత్మక ప్రయత్నం మాత్రం చేయటం లేదు.

స్వతంత్ర పోరాటకాలంలో గాంధీ, నెహ్రూ, పటేల్, సుభాష్ బోస్, అంబేద్కర్, సరోజినీ నాయుడు, మౌలానా ఆజాద్, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్, ప్రకాశం పంతులు వంటి అనేకమంది తమ ఆకర్షణీయమైన ఆదాయావకాశాల్ని, జీవితాల్ని ఫణంగా పెట్టి రాజకీయాల్లోకి వచ్చారు. ఒకతరం కాలంలో ఇంతమంది అసాధారణ నేతలు రాజకీయాల్లోకి రావటం బహుశా మరేదేశ చరిత్రలోనూ కన్పించదు. కానీ ఆర్థికవ్యవస్థ వేగంగా ఎదుగుతూ ఏరోజుకారోజు పనిచేయటం ఆదాయానికి కీలకంగా మారిన ఆధునిక పోటీ కాలంలో ఇలాంటి త్యాగాల్ని అందరి నుంచీ ఆశించటం ఆచరణసాధ్యం కాదు. దానికితోడు డబ్బే రాజకీయంగా మారిపోవటం, ఎన్నికల వ్యవస్థ కూడా దాన్ని ప్రోత్సహించే రీతిలో ఉండటం వల్ల ఇప్పటికే రాజకీయాలలో ఉన్న ఉత్తములు క్రమంగా వైదొలుగుతున్నారు, కొత్తగా రాజకీయాలలోకి రావాలని భావించే సమర్థులు, నిజాయతీపరుల సంఖ్య తక్కువగా ఉంటోంది. దేశ జనాభాలో మూడొంతులు యువజనాభా ఉండటం కొండంత ఆశను రేకెత్తిస్తున్నా, రాజకీయాల్లో ఎదుగుతున్నవారు నేతల వారసులే తప్ప సామాన్య యువత కారు. రాజకీయాలలో కనీస లక్షణంగా ఉండాల్సిన నిజాయతీ, ఈవేళ అత్యున్నత అర్హతగా మారిపోయింది. దేశ ప్రయోజనాలతో పనిలేకుండా ఎంతకైనా తెగించి మాట్లాడే, దోచుకునే రాజకీయ ఎంటర్‌ప్రెన్యూర్‌లే ఇప్పుడు రాజకీయ నేతలుగా వస్తున్నారు. ప్రజల పేదరికాన్ని తొలగించే విధానాలు అమలుచేయకుండా, ప్రజలను నిరంతరం అర్థించే నిస్సహాయులుగా తయారుచేసి ఎప్పటికెయ్యది... అనే రీతిలో కేవలం ఓట్లు దండుకునే విధానాలనే అమలు చేసే రాజకీయ ఎంటర్‌ప్రెన్యూర్‌లు, వారి రాజకీయ బ్యూరోక్రాట్ల వ్యవస్థ మన ప్రజాస్వామ్యాన్ని ఆధునిక రాచరికంలాగా మార్చేసింది.

ఈ ప్రమాదకర పరిస్థితి నుంచి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుని రాజ్యాంగ నిర్మాతలు ఆశించినట్టు పరిణతి చెందేలా చేసుకోవటానికి, తక్షణ డిమాండ్లకు – దీర్ఘకాలిక లక్ష్యాలకు సమన్వయాన్ని సాధిస్తూ ప్రజల్ని ప్రభువులుగా నిలపటానికి ఏకకాలంలో బహుముఖ పోరాటం కావాలి. రాజకీయ, ఆర్థిక, న్యాయ సంస్కరణలు, పాలనా వికేంద్రీకరణ, అవినీతి అంతానికి అన్నిస్థాయిల్లో బలమైన చట్టాలు, ఎన్నికల వ్యవస్థలో మార్పులు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం వంటి వాటితోపాటు సామాన్యుల జీవితాల్లో రోజువారీ సేవల్ని, అంటే ధ్రువపత్రాలు, మంచినీటి కనెక్షన్, పట్టాదారు పాసుపుస్తకం, ల్యాండ్ రికార్డులు, భూమి రిజిస్ట్రేషన్, విద్యుత్ కనెక్షన్ వంటి

సేవలన్నిటినీ ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి, వేధింపులు, ఆలస్యం లేకుండా అందించేందుకు ఖచ్చితమైన ఏర్పాట్లు కావాలి. అలా ప్రజలకు పనుల్ని ఒక సేవలాగా చెప్పిన సమయంలో అందించలేకపోతే, రోజుకి రూ.250 పరిహారాన్ని చెల్లించాలి. దేశవ్యాప్తంగా ఇలాంటి 'పౌరసేవల హక్కు' చట్టం (సిటిజన్/పబ్లిక్ సర్వీసెస్ గ్యారంటీ యాక్టు) కోసం లోక్‌సత్తా ఉద్యమం సుదీర్ఘకాలంగా కృషి చేస్తోంది. 'స్వరాజ్యం' పేరుతో లోక్‌సత్తా ఉద్యమసంస్థ రూపొందించిన పౌరసేవల పత్రాల పుస్తకాన్ని 1998, అక్టోబర్ 2న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ రంగరాజన్ ఆవిష్కరించారు. రెండు లక్షలకు పైగా స్వరాజ్యం కాపీల్ని ప్రజల్లోకి లోక్‌సత్తా తీసుకెళ్లింది. కుత్బుల్లాపూర్, గుంటూరు, తణుకు వంటి పురపాలక సంఘాల్లో కొన్ని సేవలకి అలాంటి సిటిజన్స్ చార్టర్లు 2001 నుండి కొంతకాలం అమలయ్యాయి. కాని చట్టబద్ధత లేకపోవటంతో కాలక్రమేణా మరుగునపడ్డాయి. ఆ తరువాత లోక్‌సత్తా కృషితో రెండు సర్వీసు గ్యారంటీ బిల్లులు 15వ లోక్‌సభాకాలంలో పార్లమెంటు ముందుకు వచ్చాయి. లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలోని బృందం పార్లమెంటరీ కమిటీతో సంప్రదించి ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీని కూడా కలిపి ఒక సమగ్ర జాతీయస్థాయి పౌరసేవల హక్కు బిల్లును తయారు చేసింది. అయితే లోక్‌సభ రద్దవటంతో ఆ బిల్లులకు కూడా కాలం చెల్లింది.

అందుకే గత బిల్లులను మెరుగుపరిచి ప్రజాఉద్యమంతో ఒత్తిడి తెస్తూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్థాయిలో కృషి చేస్తూ దేశవ్యాప్తంగా పౌరసేవల హక్కు చట్టం తెచ్చేందుకు మళ్లీ తాజాగా 2014లో అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవమైన డిసెంబర్ 9 నుంచి లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ప్రయత్నం ప్రారంభించింది. ఇందులో భాగంగా హైదరాబాద్, విశాఖపట్నంలో రౌండ్‌టేబుల్ సమావేశాలను ఏర్పాటుచేసి వివిధ రంగాలకు చెందిన పౌరప్రముఖులు, నిష్ణాతుల నుంచి సూచనలు తీసుకుంటూ బిల్లుని మరింత మెరుగుపరిచే ప్రయత్నం చేపట్టింది. సమాచార హక్కు చట్టంలాగా జాతీయస్థాయిలో ఒకే చట్టాన్ని పార్లమెంటు ద్వారా తీసుకురావటం, వీలుకాకపోతే కేంద్రంలో, రాష్ట్రాల్లో వేర్వేరుగా పౌరసేవల హక్కు చట్టాన్ని తీసుకురావటం కోసం లోక్‌సత్తా కృషి చేస్తోంది.

ప్రజలకు సరైన సేవలు అందించటానికి చెప్పుకోదగిన దేశాలన్నీ కూడా పౌరసేవల గ్యారంటీ చట్టం లేదా ఆ తరహా ఏర్పాట్లను చేసుకున్నాయి. ఈ సేవ, మీ సేవ వంటి ఎలక్ట్రానిక్ సేవలు అందుబాటులోకి వచ్చినప్పటికీ, మనదేశంలో ప్రభుత్వ సేవలు చెప్పుకోదగిన ఏ దేశంలో కంటే కూడా నాసిరకంగానే ఉన్నాయి. జాతీయస్థాయిలో 137, రాష్ట్రాలలో 700కి పైగా సిటిజన్ చార్టర్లున్నా వాటికి సమగ్ర చట్టబద్ధ ఏర్పాట్లు లేకపోవటం వల్ల హక్కుగా ప్రజలకు పనులు జరగటం లేదు. ఈ నేపథ్యంలో కోట్లాది ప్రజల రోజువారీ జీవితంతో ముడిపడిన పౌరసేవల హక్కు చట్టాన్ని మనదేశంలో తీసుకురావటం ఇప్పటికైనా అత్యవసరం. దేశాన్ని మార్చేసే భారమంతా ఈ ఒక్క చట్టం మీదే మోపనక్కర్లేదుగానీ, అన్నిరంగాలనూ స్పృశించే పౌరసేవల హక్కు చట్టం మన ప్రభుత్వానికి, పాలనకు గుండెకాయగా మారుతుం దనటంలో, స్వతంత్ర భారతంలో అత్యంత ప్రభావశీలమైన చట్టమవుతుందనటంలో మాత్రం సందేహం లేదు.

విద్యుత్ స్తంభం మీద ఫ్యూజ్ పోవటం, మురుగునీరు పేరుకుపోవటం వంటి స్థానిక పాలనా సమస్యల మీద నియోజకవర్గ ప్రజల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్‌తో సతమతమవుతూ, రాజకీయ బ్యూరోక్రాట్లను పోషించలేక ఉక్కిరిబిక్కిరవుతూన్న రాజకీయ నేతలకు కూడా ఊరటనిచ్చే చట్టమిది. లోక్‌సత్తా రూపొందించిన పౌరసేవల హక్కు బిల్లు స్వచ్ఛభారత్ లక్ష్యాలకు, స్థానిక ప్రభుత్వాల సాధికారతకు దోహదం చేసేలా ఉండటంతోపాటు విద్య, ఆరోగ్యం వంటి సేవలకు, నాణ్యతాప్రమాణాల పెంపునకు విస్తరించేందుకు వీలుగా జనరిక్‌గా రూపొందించినది. ఒకసారి ఇలాంటి చట్టం జాతీయస్థాయిలోను, రాష్ట్రాలలోను అమలయితే, సామాన్య ప్రజలకి దైనందిన కార్యక్రమాలలోను, ప్రభుత్వ ఆఫీసులతో లావాదేవీలలోను అసౌకర్యం లేకుండా సులభంగా సేవలందుతాయి. ప్రతిరోజూ లక్షలాది మంది లంచాలు, ఆలస్యం లేకుండా సేవలు పొందగలుగుతారు.

సుపరిపాలనకు కీలకమైన పౌరసేవల హక్కు చట్టాన్ని సాధించుకోవటానికి తెలుగునాట అన్ని కాలేజీలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, కాలనీ, రెసిడెంట్స్, ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్లు, వినియోగదారుల సంఘాలు, మహిళా, రైతు, వృత్తి, ఇతర ప్రజాసంఘాలు ఎవరికి వారు, ఎక్కడికక్కడ చొరవ తీసుకుని సమావేశాలు, ప్రచార కార్యక్రమాలతో ముందుకురావటం, చట్టసభల ప్రతినిధులు, పాలకులు వాస్తవ దృష్టితో ఆలోచించి చట్టం చేసేందుకు వేగంగా స్పందించటం చారిత్రక అవసరం.

**- ఎన్. శ్రీనివాస్, భీశెట్టి బాబ్జీ**

**(లోక్‌సత్తా ఉద్యమ సంస్థ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కన్వీనర్లు)**

# పోలీసు స్టేషన్ గడప తొక్కనవసరం లేదు

## ఆన్‌లైన్‌లోనే సర్టిఫికెట్ ఇచ్చేందుకు సరికొత్త యాప్

మీ వాహనం అనుమతి (లైసెన్స్), రిజిస్ట్రేషన్ పత్రాలో పోతే చాలు పోలీసు స్టేషన్‌కు పరుగులు పెట్టాల్సిందే. అక్కడ ఫిర్యాదు అనంతరం వారిచ్చే ధ్రువీకరణ పత్రాన్ని (సర్టిఫికెట్) రవాణా శాఖకు సమర్పిస్తేనే సంబంధిత అధికారులు తిరిగి నకలు పత్రాలు జారీ చేసే వారు. ఇలా విచారణ ధ్రువీకరణ పత్రాల కోసం ఏటా వేల సంఖ్యలో ప్రజలు స్టేషన్లు చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పుడిక వారికి ఆ బాధలు తప్పనున్నాయి. సెల్‌ఫోన్ యాప్‌లో ఈ వివరాలను నమోదు చేసిన కొన్ని క్షణాల్లోనే ఈ సర్టిఫికెట్ తిరిగి సంబంధిత వ్యక్తికందే ఏర్పాట్లను హైదరాబాద్ నగర పోలీసులు చేయనున్నారు.

ప్రస్తుతం పదుల సంఖ్యలో కంపెనీలు తాము జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలను వినియోగదారులు పోగొట్టుకుంటే.. నకలు పత్రాలు జారీకి పోలీసు ధ్రువీ కరణను ప్రామాణికంగా తీసుకుంటు న్నాయి. ఫిర్యాదు దారుడు పోగొట్టుకున్న పత్రాలు తమ విచారణలో దొరక లేదంటూ పోలీసులిచ్చిన ధ్రువపత్రాన్ని ఫిర్యాదుదారు సంబంధిత సంస్థ, ప్రభుత్వ కార్యాలయాలకు సమర్పిస్తేనే నకలు పత్రాలు, సర్టిఫికెట్‌లను తిరిగి జారీ చేస్తారు. దాదాపు 30 రకాల వస్తువులకు, పత్రాలకు పోలీసు ధ్రువీకరణ అవసరమని తేలింది. వేల సంఖ్యలో ఈ తరహా ఫిర్యాదులొస్తున్న నేపథ్యంలో పోలీసులు "మీ సేవ"లో దీని కోసం దరఖాస్తు చేసుకోవాలని నిబంధన పెట్టారు. అయినా నిర్ణీత సమయంలో ఇవి అందకపోవడంతో వేలాది మంది పోలీసు స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నారు. సాధారణంగా ఈ ధ్రువీకరణ పత్రాలను ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి మాత్రమే జారీ చేస్తారు. వీరికి సమయం లేకపోవడంతో జారీలో తీవ్ర జాప్యం జరుగుతోందంటూ నగర పోలీసు కమిషనర్ ఎం.మహేందర్ రెడ్డికి ఫిర్యాదులం దుతున్నాయి. ఇలాంటి సమస్యతో ఏ ఒక్కరూ పోలీసు స్టేషన్‌కు రాకుండా.. ఆన్‌లైన్‌లోనే సమస్య పరిష్కారమయ్యేలా చేసేందుకు ఒక యాప్‌ను రూపొందించారు. యాప్‌ను సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని సమస్యను నమోదు చేస్తే చాలు..చిటికెలో పరిష్కారమైపోతుంది. ఉదా: నకలు లైసెన్సు కోసం పోలీసుల నుంచి ధ్రువీకరణ పత్రం కావాలనుకుంటే ఈ యాప్‌లోకి వెళ్లి లైసెన్సు నెంబర్, కార్డు జారీ తేదీ, జారీ చేసిన అధికారి వివరాలతోపాటు సంబంధిత వ్యక్తి ఆధార్ నెంబర్ నమోదు చేయాలి. (సర్టిఫికెట్ జిరాక్సు ప్రతిని పంపమంటే ఎలా ఉంటుందన్న దానిపైనా ఆలోచన చేస్తున్నారు.) ఇలా నమోదు చేసిన కొన్ని సెకన్ల వ్యవధిలోనే దరఖాస్తుదారుకు విచారణ సర్టిఫికెట్ పోలీసుల డిజిటల్ సంతకంతో అందుతుంది. తమకు ఫలానా వ్యక్తి నుంచి ఈ ధ్రువీకరణ పత్రం కావాలని దరఖాస్తు అందింది...ఫిర్యాదుదారుని సంబంధిత పత్రం పోయిందని మాత్రమే ఆ పత్రంలో ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. ఈ ధ్రువీకరణ పత్రాన్ని సంబంధిత సంస్థలు, ప్రభుత్వ విభాగాలతో అంగీకరింపచేసేందుకు వీరితో కమిషనర్ మహేందర్ రెడ్డి వారం రోజుల్లో సమావేశమవనున్నారు. ఇంతకంటే తాము %“%నో ట్రేస్ సర్టిఫికెట్%“% జారీ చేయలేమని.. తామిచ్చే ఈ ధ్రువీకరణను అంగీకరిం చాలంటూ వారిని ఒప్పించాలని నిర్ణయించారు. పది రోజుల్లో ఈ కొత్త యాప్‌ను వినియోగం లోనికి తేవడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు. దేశ రక్షణకు సంబంధించిన విషయం కాబట్టి పాస్‌పోర్టులాంటి కొన్నింటి విషయంలో మాత్రం ఈ విధానం కింద సర్టిఫికెట్ ఇవ్వకూడదని అధికారులు నిర్ణయించారు.

# థర్మల్ కేంద్రాల నిర్మాణంతో ఉపాధి వెలుగులు



తెలంగాణలో థర్మల్ విద్యుదుత్పత్తిపై రాష్ట్ర ప్రభుత్వం బుధవారం మరో కీలక నిర్ణయం తీసుకుంది. నల్గొండ జిల్లాలో కొత్తగా ఏర్పాటుచేయదలచిన థర్మల్ విద్యుత్ కేంద్రాల సంఖ్యను 6 నుంచి 9కి పెంచాలని తెలంగాణ జెన్‌కోకు సూచించింది. తొలుత 6 థర్మల్ కేంద్రాల్లో 4400 మెగావాట్ల విద్యుదుత్పత్తికి సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) తయారుచేయాలని సూచించింది. కానీ దాన్ని తాజాగా 9 కేంద్రాల్లో 6800 మెగావాట్లకు పెంచుతూ డీపీఆర్‌ను జెన్‌కో సిద్ధం చేసింది. దీన్ని గురువారం సీఎం కేసీఆర్‌కు అందజేయనుంది. తొలుత ఈ జిల్లాలో తెలంగాణ జెన్‌కో తరఫున 4400 మెగావాట్లు, ఎన్టీపీసీ తరఫున మరో 2400 మెగావాట్లకు స్థలం ఎంపిక చేశారు. కానీ ఎన్టీపీసీ ఇప్పటికే రామగుండంలో తెలంగాణ కోసం 1600 మెగావాట్ల విద్యుత్కేంద్రాల నిర్మాణం పనులు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో ఎన్టీపీసీకి తొలుత ఇవ్వదలచిన 2400 మెగావాట్ల ఉత్పత్తి కేంద్రాల స్థలాన్ని సైతం తెలంగాణ జెన్‌కోకు అప్పగించి వెంటనే పనులు చేపట్టాలని డీపీఆర్‌లో స్పష్టం చేసింది. సీఎంకు అందజేయనున్న నివేదికలోని ముఖ్యాంశాలు...

- నల్గొండ జిల్లా వీరులపాలెం, దిలావర్‌పూర్ గ్రామాల్లో మొత్తం 10,709 ఎకరాలను ప్రభుత్వం సేకరించనుంది.
- ఇందులో తెలంగాణ జెన్‌కోతరఫున 600 మెగావాట్ల కేంద్రాలు రెండు, 800 మెగావాట్లవి 7 థర్మల్ కేంద్రాలను నిర్మిస్తారు.
- వీటి నిర్మాణానికి రూ.41,480 కోట్ల వ్యయం అవుతుంది. ఒక్కో మెగావాట్ విద్యుదుత్పత్తికి రూ.6.1 కోట్ల ఖర్చవుతుందని అంచనా.
- మొత్తం సొమ్ములో కేంద్ర విద్యుత్ ఆర్థిక సంస్థల నుంచి రూ.36 వేల కోట్ల రుణాలు తెస్తారు. మిగిలిన సొమ్మును ప్రభుత్వ వాటా కింద జెన్‌కో సమకూరుస్తుంది. ప్రభుత్వ వాటాకింద ఈ ఏడాదిలో రూ.వెయ్యి కోట్లను ఇవ్వనుంది.
- మొత్తం 9 థర్మల్ కేంద్రాల నిర్మాణం పూర్తయితే ప్రత్యక్షంగా పదివేల మందికి, పరోక్షంగా మరో లక్షమందికి ఉపాధి లభిస్తుందని అంచనా.
- మొత్తం భూసేకరణపై ఇప్పటికే నల్గొండ జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి సమగ్ర నివేదిక పంపారు. అక్కడి ప్రజలకు పరిహారం, పునరావాసానికి సైతం యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటారు.
- మొత్తం 6800 మెగావాట్ల ఉత్పత్తి కేంద్రాల నిర్మాణ కాంట్రాక్టును ఏకమొత్తంగా బీహెచ్‌ఈఎల్(భెల్)కే ఇవ్వాలని జెన్‌కో సూచించింది.
- మరో 2400 మెగావాట్ల విద్యుదుత్పత్తికి సైతం ఇక్కడ స్థలాలు అందుబాటులో ఉన్నాయి. ఎన్టీపీసీ వెంటనే ముందుకొచ్చినా స్థలాలు కేటాయిస్తామని తెలిపింది.

## అవిశ్రాంతంగా పనిచేశాం

సాధారణంగా కొత్త విద్యుత్కేంద్రానికి డీపీఆర్ తయారుచేయాలంటే 3 నెలల సమయం పడుతుంది. కానీ సీఎం ఆదేశాల మేరకు కేవలం పదిరోజుల వ్యవధిలో అవిశ్రాంతంగా జెన్‌కో ఇంజినీర్లంతా పనిచేసి మొత్తం 9 కేంద్రాలకు సంబంధించిన డీపీఆర్‌ను సిద్ధం చేశారు. తెలంగాణలో ఉన్న కరెంటు కొరత తీర్చాలన్న తపనతో కాలంతో పోటీపడి పనిచేశాం. విద్యుత్కేంద్రాల నిర్మాణం సైతం ఇలాగే పూర్తిచేస్తాం.

–డి.ప్రభాకరరావు, సీఎండీ, టీజెన్‌కో

# స్థానిక ప్రభుత్వాలకు ఏటా తలసరి రూ.1000 కేటాయిస్తే ఐదేళ్లలో స్వచ్ఛభారత్: జేపీ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలాగే స్థానిక ప్రభుత్వాలకు కూడా తగినన్ని నిధులు, అధికారాలు ఉంటేనే స్వచ్ఛభారత్ లక్ష్యం నెరవేరుతుందని జేపీ అన్నారు. ఈ ఏడాది కేంద్రప్రభుత్వం రాష్ట్రాలకు రూ.7,78,000 కోట్లను బదిలీ చేస్తోందని, ఇందులో ఆరవ వంతును స్థానిక ప్రభుత్వాలకు ఇస్తే తలసరి ఒక్కో పౌరుని పేర రూ.1000 వస్తాయని అన్నారు. ఏటా ఇలా బదిలీ చేస్తే ప్రజలకు కూడా నిధులు కనిపిస్తూ, పాలన అర్థమవుతూ ఐదేళ్లలో స్వచ్ఛభారత్ సాకారమవు తుందన్నారు. భారీ అంచనాలతో విస్తృత ప్రచారం వల్ల రాజకీయ ఒత్తిడి పెరుగు తుందని, ప్రజలలో చైతన్యం వస్తుందని, కానీ లక్ష్యాల్ని సాధించాలంటే వీటికితోడు సమగ్ర కార్యాచరణ, పర్యవేక్షణ, జవాబుదారీతనం ఉండాలని అన్నారు. పంచాయతీల్ని, మునిసిపాలిటీల్ని జవాబుదారీతనంతో బలోపేతం చేస్తే యంత్రాంగం చేత పనిచేయించి లక్ష్యాల్ని సాధించగలవని అన్నారు.

ప్రస్తుతం ఒత్తిడంతా కేంద్ర, రాష్ట్రాల స్థాయిలోనే ఉందని, మందకొడి, బాధ్యతారహిత పాలనా యంత్రాం గాన్ని కేంద్రం, రాష్ట్రాలు కదిలించలేకపోతున్నాయని జేపీ అన్నారు. ఫలితాలను సాధించటానికి ప్రభుత్వాన్ని పునర్నిర్మించి, అధికారాన్ని-జవాబుదారీతనాన్ని మేళవించి సరైన ప్రోత్సహకాలు, ప్రజల భాగస్వామ్యం ఉండేలా చేయాలన్నారు. స్థానిక ప్రభుత్వాలకు మితిమీరిన పటాటోపం తప్ప నిధులు, అధికారాలు లేకుండా చేయటం వల్లే 73,74 రాజ్యాంగ సవరణలు విఫలమయ్యాయన్నారు. ఏవో ఎంపిక చేసుకున్న కొన్ని ప్రాంతాలలోనే కాకుండా అన్ని చోట్లా ఫలితాలను సాధించటం మీద దృష్టి కేంద్రీకరించాలని, ప్రభావశీలమైన, జవాబుదారీతనంగల స్థానిక ప్రభుత్వాలతో రాజకీయ ఒత్తిడి, ప్రజలలో ఉన్న డిమాండ్ ఆచరణలో ఫలితాలనిస్తాయని అన్నారు.

మత విద్వేషాలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తున్న బీజేపీ ఎంపీ సాక్షి మహరాజ్‌కి ఇప్పటికైనా ఆ పార్టీ షోకాజ్ నోటీసు ఇవ్వటం సంతోషకరమని జేపీ అన్నారు. అలాంటి మిత్రులుంటే ప్రధాని నరేంద్ర మోదీకి వేరే శత్రువులు అక్కర్లేదన్నారు. మన దృష్టి మొత్తాన్నీ అభివృద్ధి, ఉద్యోగాలు, ఆదాయాలు, అందరికీ అవకాశాల మీద ఉంచాలని, పేదరికాన్ని నిర్మూలించటానికి ఇదొక్కటే మార్గమని, మన మధ్య విభజనలు అక్కర్లేదని జయప్రకాష్ నారాయణ్ ఒక ప్రకటనలో అన్నారు.

# భారతదేశ ఎన్నికలలో ఎలక్ట్రానిక్ ఓటింగ్‌కు ఎన్నారై ఓటింగ్ ప్రక్రియ బాట వేయాలి: జేపీ

ప్రవాస భారతీయుల (ఎన్నారైలు)కి ఓటు హక్కును కల్పించాలన్న సుప్రీంకోర్టు సూచనను స్వాగతిస్తున్నామని, చాలా దేశాలలాగా మనం కూడా విదేశీగడ్డ మీద ఉంటున్న స్వదేశస్తులందరికీ ఓటు హక్కునివ్వాలనేది సుదీర్ఘకాలంగా ఉన్న డిమాండని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. అయితే పోస్టల్ బ్యాలెట్ పద్ధతి ఇందుకు పనికిరాదని, తగిన జాగ్రత్తలతో ఎలక్ట్రానిక్ ఓటింగ్ పద్ధతినే అమలు చేయాలని అన్నారు. ఎన్నారైల ఓటింగ్‌ను పైలెట్ కార్యక్రమంగా ఉపయోగించుకుని, లోపాలేమన్నా ఉంటే సరిచేసి రాబోయే కాలంలో భారత దేశంలోని ప్రజలకు కూడా అన్ని ఎన్నికలలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ సౌకర్యాన్ని కల్పించాలని అన్నారు.

# సమాచారం అడిగే పౌరులు బిచ్చగాళ్లు కాదు: జేపీ

## లోక్‌సత్తా నేత పట్ల తమిళనాడు ఆర్‌టిఐ కమిషన్ తీరుకు తీవ్ర ఖండన

కూర్చోవటానికి కుర్చీ అడిగినందుకు లోక్‌సత్తా నేత, సమాచార హక్కు చట్టం కార్యకర్త శివ ఇలంగోను తమిళనాడు ఆర్‌టీఐ కమిషన్ అరెస్టు చేయించటాన్ని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ శుక్రవారం తీవ్రంగా అభిశంసించారు. రహస్యాలు లేకుండా పాలన తీరుతెన్నుల్ని ప్రభుత్వాలు ప్రజలకు విన్నవించాలంటూ పౌరులకు గౌరవాన్నిచ్చేందుకే ఆర్‌టిఐ చట్టం ఏర్పడిందని అన్నారు. సమాచార కమిషన్ ముందు దరఖాస్తులు చేసుకునే పౌరులు బిచ్చగాళ్లు కాదన్నారు.

చెన్నై తేనంపేటలోని తమిళనాడు సమాచార కమిషన్ ప్రధాన కార్యాలయంలో జరుగుతున్న తన అప్పీలు హియరింగ్‌లో కూర్చోవటానికి కుర్చీ అడిగిన శివ ఇలంగో అభ్యర్థనను ఆ రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ కె.ఎస్ శ్రీపతి, కమిషనర్ ఎస్.ఎఫ్ అక్బర్ తిరస్కరించారు. కుర్చీ తీసుకుని ఇలంగో కూర్చోవటంతో కమిషనర్లు అరెస్టుకు ఆదేశించారు. పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేసి శివ ఇలంగోను కోర్టు రిమాండ్‌కు పంపారు.

ఈ మొత్తం ప్రక్రియలో యంత్రాంగం వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నాయని, అధికార అహంకారాన్ని, కుసంస్కారాన్ని, ప్రజల్ని యాచకులుగా చూసే వలస పాలకుల సంస్కృతిని బైటపెడుతున్నాయని జేపీ అన్నారు.

తమిళనాడు ఆర్‌టిఐ కమిషన్ ఆధిపత్య ధోరణుల్ని ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలని, సమాచార కమిషనర్లు ప్రజాసేవకులమని గుర్తుంచుకుని పాలనా యంత్రాంగానికి ఆదర్శంగా నిలిచేలా పాఠం నేర్వాలని అన్నారు.

# శ్రీలంక ఎన్నికల ఫలితం ప్రజల గాయాల్ని మాన్పాలి

అధికారం శాశ్వతమని, ఏం చేసినా ఎల్లకాలం ప్రజలు పడుంటారని భావిస్తే ప్రజాస్వామ్యంలో ఏం జరుగుతుందో శ్రీలంకలో రాజపక్స ఓటమి రుజువు చేస్తోందని జేపీ అన్నారు. ఏడాది క్రితం ఈ ఫలితాన్ని ఎవరూ ఊహించలేదన్నారు. సమ్మిళిత సమాజం, శాంతి, సమన్యాయం కోసం శ్రీలంక ప్రజల ఆకాంక్షకు సిరిసేన విజయం అద్దం పడుతోందన్నారు. ఇప్పుడు లంకవాసుల గాయాల్ని నయం చేయాలన్నారు. హింస, విభజన విద్వేషాలతో శ్రీలంక గత మూడు దశాబ్దాలుగా నలిగిపోతోందని, ఫెడరల్ వ్యవస్థ, అభివృద్ధికి ఇప్పుడు అవకాశం లభించిందని అన్నారు. శ్రీలంకలో సామరస్యతను పునరుద్ధరించటానికి, పునర్నిర్మాణం, ఆర్థికాభివృద్ధికి భారత్ తోడ్పాటునివ్వాలని జయప్రకాష్ నారాయణ్ శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు.

# సహకార హక్కుల్ని కాలరాస్తే ఎదిరించండి.. అండగా ఉంటా..

## పాడి రైతులకు జేపీ భరోసా..

రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కుల్లో భాగంగా రైతులు ఏర్పాటు చేసుకున్న సహకార సంఘాల, ఉత్పత్తిదారుల సంస్థల జోలికి ప్రభుత్వం వస్తే మౌనంగా ఉండకుండా తమ హక్కుల రక్షణకు ఎదురుతిరగాలని లోక్‌సత్తా రైతులకు అండగా ఉంటుందని లోక్‌సత్తా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్ అన్నారు. కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో గ్రామీణాభివృద్ధి రైతులు-పౌరసేవలపై టి. రాజమౌళి స్మారకోపన్యాసం చేశారు. డెయిరీ సంక్రాంతి సంబరాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

సింగరేణి, ఎన్‌టీపీసీ లాంటి ప్రభుత్వ రంగ సంస్థలు కూడా కంపెనీ చట్టం కిందే రిజిస్టర్ అయ్యాయని అలాంటిది డెయిరీ ప్రొడ్యూసర్ కంపెనీ అయితే వ్యక్తిగతం ఎలా అవుతుందని ఆయన ప్రశ్నించారు. తెలంగాణలో కరీంనగర్, నల్లగొండ-రంగారెడ్డి డెయిరీలు మాత్రమే లాభాల్లో నడుస్తున్నాయని రైతులను ఆదుకుంటున్నాయని అలాంటి డెయిరీల జోలికి పోయి నిర్వీర్యం చేస్తామంటే ఊరుకునేది లేదని జేపీ హెచ్చరించారు.

సర్వీస్ గ్యారంటీ బిల్లు తెచ్చి లంచాలు లేకుండా ప్రజలకు సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని జేపీ కోరారు. రైతులకు అందించే పట్టాదారు పాస్‌పుస్తకాలు లంచం లేకుండా ఇవ్వడం లేదని రైతులు ముక్తకంఠంతో అన్నారు. అసలు ప్రభుత్వాలకు సిగ్గుందా అని ఆయన విమర్శించారు. ప్రజలందరి బతుకుల్లో వెలుగునిచ్చేది ప్రజాస్వామ్యం అని కొన్ని కుటుంబాలకు పదవులు, పైసలు సంపాదించిపెట్టేది కాదని ఆయన అన్నారు. కరీంనగర్ డెయిరీ చైర్మన్ రాజేశ్వర్‌రావు గత 14ఏళ్లుగా డెయిరీ అభివృద్ధికి చేస్తున్న కృషిని ఆయన అభినందించారు.

సమావేశంలో లోక్‌సత్తా రాష్ట్ర కన్వీనర్ ఎన్.శ్రీనివాస్, ప్రకాశ్‌హెూల్లా, చంద్రప్రభాకర్, సూర్యారావు, గంగారావు తదితరులు పాల్గొన్నారు. డెయిరీ ఎండీ హన్మంతరెడ్డి డైరక్టర్‌లు1200 మంది రైతుల పాల్గొన్నారు.






లోక్‌సత్తా మాజీ కార్యదర్శి రాజమౌళి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జేపీ



కరీంనగర్ డెయిరీ సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న జేపీ

Posting Date 22-01-2015
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2013-15 Published on January 20th, 2015v




కరీంనగర్‌లో
రైతుల సమస్యలపై
ప్రసంగిస్తున్న
జయప్రకాష్ నారాయణ్.
హాజరైన రైతులు

| Book-Post<br>PRINTED MATTER | To, |
|---|---|
| If not delivered please return to:<br><br>Lok Satta Times<br>Tulips Apartment,<br>6-3-655, Flat.No. 407,<br>Behind Civil Supplies Office,<br>Somajiguda<br>Hyderabad- 500082 | |

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad